తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

ఆదివారం
19 అక్టోబరు, 2025







# వికసిత భారతంలో
# విజయ దీపావళి

# కార్తీక్ దర్శకత్వంలో నాగార్జున



సీనియర్ హీరో అక్కినేని నాగార్జున తన కెరీర్‌లో మైలురాయిగా నిలిచిపోయే 100వ సినిమాను ఎలాంటి ఆర్భాటం లేకుండా ప్రారంభించినట్లు తెలుస్తోంది.

ఇటీవలి కాలంలో 'కుబేర', 'కూలీ' వంటి విజయవంతమైన చిత్రాలతో మంచి ఊపు మీదున్న ఆయన, తన వందో ప్రాజెక్టును కూడా సెట్స్‌పైకి తీసుకెళ్లారు. అంతేకాకుండా, ఈ చిత్రానికి 'లాటరీ కింగ్' అనే ఆసక్తికరమైన టైటిల్‌ను దాదాపు ఖరారు చేసినట్లు టాలీవుడ్ వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది.

తమిళ దర్శకుడు కార్తీక్ దర్శకత్వంలో నాగార్జున 100వ చిత్రం తెరకెక్కుతోంది.

ఇది పూర్తిస్థాయి యాక్షన్ అండ్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా రూపుదిద్దుకోనుంది. నాగార్జున సొంత నిర్మాణ సంస్థ అన్నపూర్ణ స్టూడియోస్ ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తోంది.

ఇప్పటివరకు 'కింగ్ 100' అనే వర్కింగ్ టైటిల్‌తో ఈ సినిమా ప్రచారంలో ఉంది.

అయితే, తాజాగా మేకర్స్ 'లాటరీ కింగ్' అనే పేరును ఖరారు చేశారని విశ్వసనీయ సమాచారం. దీనిపై అతి త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

# మహేశ్‌బాబు కొత్త సినిమా టైటిల్ 'వారణాసి'?

మహేశ్ బాబు, స్టార్ డైరెక్టర్ ఎస్ఎస్ రాజమౌళి కాంబినేషన్‌లో వస్తున్న పాన్ వరల్డ్ సినిమా గురించి ఒక సెన్సేషనల్ అప్డేట్ బయటకు వచ్చింది. ఇప్పటివరకు అత్యంత రహస్యంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ సినిమా టైటిల్‌ను హాలీవుడ్ దిగ్గజ దర్శకుడు జేమ్స్ కామెరూన్ చేతుల మీదుగా ఆవిష్కరించేందుకు రాజమౌళి భారీ ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. ప్రముఖ హాలీవుడ్ సినిమా 'అవతార్: ద ఫైర్ అండ్ యాష్' ప్రమోషన్స్ కోసం జేమ్స్ కామెరూన్ నవంబర్ నెలలో భారత్‌కు రానున్నారు. ఇదే సరైన సమయమని భావించిన రాజమౌళి, ఆయనతో తన సినిమా టైటిల్ ను అధికారికంగా ప్రకటించాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. 'ఆర్ఆర్ఆర్' సినిమాతో అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న జక్కన్న, ఇప్పుడు తన తర్వాతి సినిమా అప్డేట్‌ను కూడా అదే స్థాయిలో ఇవ్వాలని ప్లాన్ చేస్తున్నారు.



మరోవైపు ఈ ప్రతిష్ఠాత్మక చిత్రానికి 'వారణాసి' అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది. వారణాసి నగరానికి చారిత్రకంగా, ఆధ్యాత్మికంగా ప్రపంచ వ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉంది. కథకు కీలకమైన అంశం కావడంతోనే రాజమౌళి ఈ పేరును ఎంచుకున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమాలో బాలీవుడ్ నుంచి హాలీవుడ్‌కు వెళ్లిన స్టార్ హీరోయిన్ ప్రియాంక చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్ ముఖ్య పాత్రలో నటిస్తున్నారు. దుర్గా ఆర్ట్స్ పతాకంపై కేఎల్ నారాయణ నిర్మిస్తున్న ఈ చిత్రానికి ఆస్కార్ విజేత ఎంఎం కీరవాణి సంగీతం అందిస్తున్నారు.

ఆదివారం వార్త

19 అక్టోబరు, 2025

## మంచి ముత్యాలు

– ప్రయత్నాలు విఫలం కావచ్చు. ప్రయత్నాన్ని విరమించకూడదు.. విశ్రమించకూడదు. ప్రయత్నించు, ఫలితాన్ని ఆశించకు.

– ఆత్మవిశ్వాసం లేనివారు అణువంత కూడా సాధించలేరు.

## కదంబం

'సంఘీ'భావం....5
మానసిక సమస్యలతో విద్యార్థులు

కవర్ స్టోరీ..6
వికసిత భారతంలో విజయ దీపావళి

ఈ వారం కవిత్వం...11
నా స్వరం మాత్రమే

కథ..20
బహుమతి

సాహిత్యం.. 23
ఆంగ్ల మాధ్యమం..

తీపి వారసత్వం..
లోనావాలా చిక్కి.. 28

ఇంకా...
మొగ్గ
వారఫలం
వగైరా.. వగైరా..

# సమాచారం

## చాక్లెట్ కొండలు



గడ్డివాములు/పెద్ద పెద్ద వెన్నకుప్పలు వరుసగా పేర్చినట్లున్న ఈ కొండలు ఫిలిప్పిన్స్‌లో ఉన్నాయి. వీటిని చాక్లెట్ కొండలు అని అంటారు. బొహోల్ ప్రావిన్సులో యాభై చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో విస్తరించి ఉన్నాయి. ఈ ప్రాంతంలో సుమారు రెండు వేల వరకు ఒకే విధంగా ఉండే ఈ పచ్చని కొండలు సందర్శకులకు కనువిందు చేస్తాయి. వేసవి కాలంలో ఈ కొండలు చాక్లెట్ బ్రౌన్ రంగులోకి మారతాయి. అప్పుడు మరింత ఆకర్షణీయంగా కనిపిస్తాయి. ఒక్కో కొండ ముప్పై నుంచి యాభై మీటర్ల సైజులో ఉంటాయి. వీటిలో అతి పెద్ద కొండ నూటా ఇరవై మీటర్ల పరిమాణంలో ఉండటం విశేషం.

### కోదండం ఆకృతిలో దేవాలయం

రామాయణాన్ని కళ్లకు కట్టినట్లు ఆవిష్కరించే మహాక్షేత్రంగా పేరు గాంచింది విజయనగరం జిల్లా కేంద్రానికి సమీపంలోని రామనారాయణం. పదిహేను ఎకరాల విస్తీర్ణంలో కోదండం ఆకృతిలో ఈ ఆలయాన్ని నిర్మించారు. ఇక్కడ రెండు అంతస్తుల్లో వివిధ రకాల విగ్రహాలు దర్శనమిస్తాయి. మధ్యలో అరవై అడుగుల ఎత్తులో ఉండే ఆంజనేయస్వామి విగ్రహం ప్రత్యేక ఆకర్షణ అని చెప్పవచ్చు.

సుదర్శనచక్ర రూపంలో గోశాల నిర్మించి మధ్యలో శ్రీకృష్ణుడి విగ్రహాన్ని ప్రతిష్టించారు. ఈ విగ్రహం రాత్రి సమయంలో మిరుమిట్లు గొల్పుతూ భక్తులను ఎంతగానో ఆకట్టుకుంటోంది.

**మీ రచనల్ని ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు.**
sunmagvaartha@gmail.com




## ఆస్తి లాక్కుని..

కిరణ్: "నువ్వు ఇంతకు ముందు బాగానే ఉండేవాడివి కదా.. ఒక అమ్మాయి ప్రేమ వల్ల పూర్తిగా రోడ్డున పడి ఇలా రైల్వే స్టేషన్‌లో ఉంటున్నావు ఏంటి?"

సందీప్: "లవ్ ఫెయిల్యూర్ వల్ల కాదు.. ఆ అమ్మాయి తండ్రి నా ఆస్తి అంతా రాయించుకుని బయటకి తోసేశాడు".

## క్లౌడ్ బరస్ట్

టీచర్: "మొన్న సైకిల్ టైర్ బరస్ట్ అయ్యి స్కూల్‌కి రాలేదు అన్నావు.. నిన్న ఎందుకు స్కూల్‌కి రాలేదు?"

స్టూడెంట్: "నిన్న మేం ఉండే ఏరియాలో క్లౌడ్ బరస్ట్ అయ్యి వర్షం కారణంగా స్కూల్‌కి రాలేదు".

## వర్షాలు ఎక్కువై..

టీచర్: "పూర్వ కాలానికి, ఇప్పటికి వాతావరణం లో వచ్చిన మార్పులు ఏంటి?"

స్టూడెంట్: "పూర్వ కాలంలో వర్షాలు రాక కప్పలకి పెళ్ళిళ్ళు చేసే వాళ్ళు. ఇప్పుడు వర్షాలు ఎక్కువయ్యి, బయటకి రాకపోవడం వల్ల మనుషుల పెళ్ళిల్లే అవ్వడం లేదు".

## మీ ఆవిడ తగ్గించమంది

యజమాని: "నీకు అసలు వంట వండడం వచ్చా.. కూరల్లో ఉప్పు లేదేంటి?

వంటవాడు: "మీకు కోపం ఎక్కువ అయ్యి బీపీ పెరిగి మీ భార్య మీద అరుస్తున్నారు కదా.. ఆవిడే వంటల్లో ఉప్పు తగ్గించమన్నారు".

## చూడమన్నారు కదా..

అత్తగారు: "ఇంట్లోకి కుక్క దూరి ఆహార పదార్థాలను తింటుంటే దాన్నే చూస్తూ ఉన్నావు ఏంటి?"

కోడలు: "మీరే కదా నేను బయటకి వెళ్తున్నాను.. కుక్క దూరుతుంది చూడు" అన్నారు.

**-ఎస్ కె. యాకూబ్ పాషా,** ఖమ్మం

## లెక్క సరిపోయింది

తల్లి: "చింటూ, నీకు రెండు



పెన్నులు, రెండు పెన్సిళ్లు ఇచ్చాననుకో. మొత్తం నీ దగ్గర ఎన్ని ఉంటాయి?"

చింటు: "ఒక్క పెన్సిలు ఉంటుంది మమ్మీ".




తల్లి: "అదేం లెక్క?"

చింటు: "అన్నయ్య అన్నీ లాక్కొని నాకు ఒక్క పెన్సిలే ఇస్తాడు కదమ్మా!"

**– మా.శ్రీ.రాజు,** పాల్వంచ

## మంచిది కాదు..

భార్య: "నిన్ను పెళ్లి చేసుకునే బదులు ఓ రాక్షసుడిని పెళ్లి చేసుకుంటే ఎంతో సంతోషంగా ఉండేదాన్ని".

భర్త: "రక్త సంబంధీకులను పెళ్లి చేసుకోవడం మంచిది కాదు వెర్రిమొఖమా" అని పెళ్లాన్ని ముద్దుగా మందలించాడు.

## నీ రక్తమేగా..

భార్య: "ఈ మధ్య మీరు మరీ విపరీతంగా ప్రవర్తిస్తున్నారు" అంది.

భర్త: ఈ మధ్య యాక్సిడెంట్ అయినపుడు నీ రక్తం ఎక్కించారుగా!" అన్నాడు.

## ఆలోచనే రాదు

"ఎక్కువ కాలం జీవించడానికి ఏదైనా మందు ఇవ్వండి డాక్టర్" అడిగాడు పేషెంట్.

"పెళ్లి చేసుకోండి"

"పెళ్లి చేసుకుంటే? ఎక్కువ రోజులు జీవిస్తామా డాక్టర్?"

"పెళ్లి చేసుకుంటే అలాంటి ఆలోచనలు రావు"

## సరదా రచనలకు ఆహ్వానం

**జోక్స్, ప్యారడీ పాటలు, సరదా అనుభవాలు, పంచ్ డైలాగులు... వగైరాలు పంపితే పరిశీలించి, బాగుంటే ప్రచురిస్తాం. దయచేసి కాపీ రచనలు పంపకండి. మీ రచనలు పంపవలసిన చిరునామా: నవ్వుల్.. రువ్వుల్, ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్ బండ్, హైదరాబాద్-500 080**

**sunmagvaartha@gmail.com**

## 'సంఘీ' భావం



# మానసిక సమస్యలతో విద్యార్థులు

విద్యార్థి దశలో ఉల్లాసంగా ఉండాల్సిన యువత తీవ్ర మానసిక వత్తిడిలకు గురౌతోంది. విద్యాబోధనలో వచ్చిన మార్పులు, కార్పొరేట్ విద్యాసంస్థల ప్రభావం, ఎదుటి వారితో పోల్చి చదవాలని వత్తిడి పెంచడం తదితర కారణాల వల్ల విద్యార్థులు తీవ్ర మానసిక వ్యాధులకు లోనుకావాల్సి వస్తోంది. ఆస్ట్రేలియాకు చెందిన ఒక సంస్థ దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో విద్యార్థుల ఆరోగ్య స్థితిగతులపై సర్వే నిర్వహించింది. ఈ సందర్భంగా ఆందోళన కలిగించే విషయాలు వెల్లడి అయ్యాయి. సుమారు 69 శాతం మంది మానసిక సమస్యలను ఎదుర్కొంటున్నారని, వారిలో పది శాతం మందికి అత్యవసరంగా వైద్య సహాయం ఇవ్వవలసిన అవసరం ఉందని తేలింది. పాఠశాలలకు వెళుతున్న 10 నుంచి 18 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న విద్యార్థులపై ఈ సంస్థ విస్తృత స్థాయిలో సర్వేను నిర్వహించింది. 70 శాతం విద్యార్థులు తరగతి గదుల్లో విద్యపై సరిగా దృష్టి సారించలేకపోతున్నారని రిపోర్టు బయట పెట్టింది. 34 శాతం నుంది విద్యార్థులు తీవ్ర మానసిక సమస్యలను ఎదుర్కొంటున్నట్లు గుర్తించారు. ఇందులో ఆరు నుంచి 10 శాతం విద్యార్థులకు అత్యవసర వైద్య సహాయం అవసరమని ఈ పరిశీలనలో తేలింది. తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో 5 వేల మంది విద్యార్థుల్లో ఈ సర్వే నిర్వహించారు. తెలంగాణలోని 2,464 మంది విద్యార్థులను సర్వే చేసింది. అదేవిధంగా దేశంలోని ఎనిమిది మెట్రో నగరాల్లో సర్వే నిర్వహించిన సందర్భంలో 70.3 శాతం మంది విద్యార్థులు ఏదో ఒక రకమైన మానసిక రగ్మతతో బాధపడుతున్నట్టు తెలిపారు. 50 శాతం మందిలో నిరాశ నెలకొని ఉందని ఈ సర్వే బయట పెట్టింది. ఉత్తరాది రాష్ట్రాలతో పోలిస్తే దక్షిణాదిలోని మూడు రాష్ట్రాల్లోని మెట్రో నగరాల్లో పోలిస్తే దక్షిణాది విద్యార్థులలో కొంత మెరుగైన ఫలితాలు ఉన్నట్లు సర్వే రిపోర్డు చెబుతోంది. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై నగరాల్లోని విద్యార్థులు ఉత్తరాది విద్యార్థులతో పోలిస్తే మెరుగ్గా ఉన్నారని సర్వేలో తేలింది. ముఖ్యంగా హైదరాబాద్‌లో మెజారిటీ విద్యాసంస్థల్లో బట్టీ పెట్టే పాఠ్యాంశం అభివృద్ధి చెందుతోందని స్పష్టం అయ్యింది. దీనివల్ల విద్యార్థులు, యువతలో ఉపాధి అవకాశాలపై నమ్మకాన్ని తగ్గిస్తోందని తెలిసింది. ముంబై, ఢిల్లీ వంటి మెట్రో నగరాలతో పోలిస్తే హైదరాబాద్‌లో జీవన వ్యయం తక్కువ. బెంగుళూరులో అనేక పరిశ్రమలతో పాటు ఐటీలో కొత్త కొత్త ఆవిష్కరణలు ఉపాధి అవకాశాలను ఎక్కువ చేస్తోందని సర్వేలో వెల్లడైంది. కర్ణాటక రాష్ట్రంలో 2,536 మంది విద్యార్థులపై సర్వే చేసింది. సర్వేలో పాల్గొన్నవారిలో 40 శాతం ముంది విద్యార్థులు తమ జీవితంలో ముఖ్యమైన వ్యక్తులను నిరాశపరిచినట్లు అభిప్రాయపడ్డారని సర్వే రిపోర్టు చెబుతోంది. హైదరాబాద్, బెంగుళూరు. చెన్నై, ఢిల్లీ విద్యార్థులతో పోలిస్తే హైదరాబాద్ విద్యార్థుల్లో తక్కువ డిప్రెషన్ స్థాయి ఉన్నట్లు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఒక యూనివర్సిటీ నిర్వహించిన మరో అధ్యయనం బయట పెట్టింది. ఈ మెట్రో నగరాలోని నలుగురు విద్యార్థుల్లో ఒకరు ఆందోళనలతో ఉన్నారనేది ఈ రిపోర్టు తెలింది. చెన్నైలో 28.2 శాతం, హైదరాబాద్‌లో 28.5 శాతం, బెంగళూరులో 27.7 శాతం మంచి నిరాశలో ఉంటున్నారని సర్వే తెలిపింది. దక్షిణాదిలోని మూడు నగరాల్లో 689 మంది విద్యార్థులపై జరిపిన అధ్యయనంలో ఈ కీలక విషయాలు వెలుగు చూశాయి. తీవ్రస్థాయి విద్యవత్తిడి వల్ల భావోద్వేగ నియంత్రణను విద్యార్థులు కోల్పోతున్నారని స్పష్టం అయ్యింది. విద్యార్థుల వ్యక్తిగత ఇష్టాయిష్టాలతో ప్రమేయం లేకుండా విద్యాభ్యాసం కొనసాగడం వల్ల ఇలాంటి పరిస్థితులు నెలకొంటున్నాయి. ముఖ్యంగా కార్పొరేట్ విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థుల్లో ఇతర అంశాలపై అవగాహన ఉండటం లేదు. పాఠశాల సమయాలు ఎక్కువగా ఉండటం, ఇంటికి వెళ్లిన తరువాత కూడా వారికి కొంత విశ్రాంతి లేకుండా హోంవర్క్ ఇవ్వడం వల్ల ఉదయం నుంచి రాత్రి పడుకునే వరకు కేవలం పుస్తకాలతో కుస్తీ పట్టే మూస పరిస్థితులు వారిలో ఆందోళనను, మానసిక వేదనను కలిగిస్తున్నాయి. అయితే వీటిని తల్లిదండ్రులు గాని, ఉపాధ్యాయులుగానీ గమనించకుండా వారిపై వత్తిడిని కొనసాగిస్తున్నారు. పాఠశాలలో ఫస్ట్ రావాలని, తోటి విద్యార్థుల కంటే ఎక్కువ మార్కులు సాధించాలని వారిపై వత్తిడి చేస్తున్నారు. ఇది విద్యార్థులకు ప్రాణాంతకంగా మారుతోంది. కొందరు విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడితే, మరికొందరిని నేరప్రవృత్తి వైపు ఉసిగొల్పేలా చేస్తున్నాయి.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ

కవర్ స్టోరీ

పి.యస్.యమ్. లక్ష్మి

# వికసిత భారతంలో విజయ దీపావళి



**మన పండగలలో సరదాల పండగ, అన్నీ మరచి, అన్ని వయసులవారూ ఆనందంగా జరుపుకునే పండగ దీపావళి. ఇది ఆశ్వయుజ బహుళ అమావాస్య రోజున వస్తుంది. సాధారణంగా చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా పండుగలు జరుపుకుంటాం. పండుగలకి సంబంధించి అనేక గాథలు వుంటాయి. అలాగే దీపావళికి సంబంధించి కూడా అనేక కథలు వున్నాయి.**

ఈ దీపావళి రోజున మహాలక్ష్మిని పూజిస్తారు. వ్యాపారస్తులు తప్పనిసరిగా తమ షాపుల్లో లక్ష్మీ పూజ చేస్తారు. కొందరు కొత్త దస్త్రాలు తెరుస్తారు. మరి మనం కూడా పండుగ చేసుకునేటప్పుడు దాని వెనుకనున్న మహిమాన్వితమైన కథలు తెలుసుకోవాలి కదా. దీపావళికి సంబంధించిన కథలలో ముందుగా దీపావళి రోజున మహాలక్ష్మిని పూజించటానికి వెనక వున్న కథ తెలుసుకుందాం.

## మహాలక్ష్మిని ఎందుకు పూజించాలి?

ఒకసారి దూర్వాస మహర్షి ఇంద్ర లోకానికి వెళ్ళి, దేవేంద్రుడిచ్చిన ఆతిథ్యానికి సంతోషించి, ఆయనకి ఒక మహిమాన్వితమైన హారాన్ని బహూకరిస్తాడు.



ఇంద్రుడు దానిని తృణీకార భావనతో తన వద్దనున్న ఏనుగు ఐరావతం మెడలో వేస్తాడు. దానికేం తెలుసు.. హారం విలువ. అది ఆ హారాన్ని కాలితో తొక్కివేస్తుంది.

అసలే దూర్వాస మహాముని. ఈ అవమానాన్ని సహిస్తాడా? దేవేంద్రుణ్ణి శపించాడు. ఆ శాప కారణంగా దేవేంద్రుడు రాజ్యం, సర్వ సంపదలు పోగొట్టుకుని, దిక్కుతోచక శ్రీ మహావిష్ణువుని ప్రార్థిస్తాడు.

శ్రీ మహావిష్ణువు దేవేంద్రుని ఒక జ్యోతిని వెలిగించి, దానిని శ్రీ మహాలక్ష్మి స్వరూపంగా భావించి పూజించమని చెప్తాడు. దేవేంద్రుడు అలాగే చేస్తాడు. ఆ పూజలకు తృప్తి చెందిన లక్ష్మీదేవి అనుగ్రహంతో తిరిగి సర్వసంపదలను పొందాడని పురాణ కథనం.

శ్రీమహావిష్ణువు దగ్గర వున్న లక్ష్మీదేవిని ఇంద్రుడు, “తల్లీ, నువ్వు ఎప్పుడూ శ్రీహరి దగ్గరే వుండటం న్యాయమా? నీ భక్తులను కరుణించవా?” అని అడుగుతాడు.

దానికి ఆ మాత “నన్ను త్రికరణ శుద్ధిగా ఆరాధించే భక్తులకు వారి వారి అభీష్టాలకు అనుగుణంగా సాక్షాత్కరిస్తాను. మోక్షాన్ని కోరేవారికి మోక్ష లక్ష్మిగా, విజయాన్ని కోరేవారికి విజయలక్ష్మిగా, విద్యార్థులకు విద్యాలక్ష్మిగా, ఐశ్వర్యాన్ని కోరి ఆరాధించేవారికి ధనలక్ష్మిగా ఇలా.. వారి వారి భక్తి ప్రపత్తులనుబట్టి, వారి కోరికలనుబట్టి అనుగ్రహిస్తాను” అని సమాధానమిచ్చింది.

అందుకనే దీపావళి రోజున మహాలక్ష్మిని పూజించేవారికి సర్వసంపదలు సమకూరుతాయని విశ్వాసం. అసుర నాశనానికి, ధర్మ ప్రతిష్ఠాపనకు గుర్తుగా అమావాస్యనాడు జరుపుకునే దీపావళి పండగనాడు లక్ష్మీదేవికి ప్రతీకగా వెలుగులు వెదజల్లే దీపలక్ష్మిని పూజిస్తే సర్వ శుభాలు కలుగుతాయని మనవారి నమ్మకం.

## నరకాసురుడి వృత్తాంతం

మనందరికీ తెలిసిన మరో కథ నరకాసురుడుది. పేరులోనే అసురుడు వున్న నరకాసురుడు రాక్షస ప్రవృత్తి కలవాడైనా, సాక్షాత్తూ శ్రీమన్నారాయణుడి కొడుకే. ఈయన రాజధాని ప్రాగ్జ్యోతిష్యపురం. అంటే ఇప్పుడు అస్సాంలోని గౌహతి ప్రాంతం. మన కన్నా ఆ ప్రాంత వాసులకి ఈ కథ బాగా తెలుస్తుంది కదండీ. అందుకే అక్కడివారు చెప్పుకునే కథ చెప్పుకుందాం.

రాక్షస సంహారం కోసం శ్రీ మహావిష్ణువు ఎత్తిన అవతారాలలో భూదేవిని రక్షించటానికి ఎత్తిన శ్వేత వరాహ అవతారం ఒకటి. ఆ అవతారంలో హిరణ్యాక్షుడిని సంహరించి భూదేవిని రక్షించాడు.

అది తామస గుణాలు కలిగిన అవతారం. ఆయన భూదేవిని వివాహం చేసుకువి భూమి మీద కొంత కాలం గడిపారు. సంధ్యా సమయంలో కామవాంఛలు వుండకూడదంటారు పెద్దలు. వరాహ రూపంలో వున్న కారణంగా ఆ నియమాన్ని పాటించని వారికి కలిగిన పుత్రుడు అసుర లక్షణాలు కలిగినవాడయ్యాడు.

మహా విష్ణువు అతనికి నరకుడు అని పేరు పెట్టాడు. అతను లోక కంటకుడు అవుతాడని, లోక రక్షణకు అతనిని చంపటం అనివార్యమవుతుందని చెప్తాడు.

పుత్ర ప్రేమతో తల్లడిల్లిన భూదేవి మహావిష్ణువును అనేక విధాల ప్రార్థించి, తన పుత్రుడు కేవలం తన చేత మాత్రమే సంహరింపబడాలనే వరం తీసుకుంది. తల్లిగా తన పుత్రుడిని తానెటూ చంపలేదు గనుక తన పుత్రుడు



చిరంజీవిగా వుంటాడనుకుంది. వరాహావతారాన్ని వీడి మహా విష్ణువు వైకుంఠం చేరాడు. నరకుడికి మహా విష్ణువు ప్రాగ్జ్యోతిష్యపురాన్నిచ్చి, సత్ప్రవర్తనతో వున్నంత కాలం సకల శుభాలతో తులతూగుతాడని చెప్తాడు.

నరకుడు చాలా కాలం సత్ప్రవర్తనతోనే వున్నాడు. అక్కడ వెలిసిన కామాఖ్యా దేవిని పూజిస్తూ ఎన్నో శక్తులు పొందాడు. అనేక సంవత్సరాలు చక్కగా రాజ్యం చేశాడు.

నరకుడు బలి చక్రవర్తి కుమారుడైన బాణాసురుడితో



స్నేహం చేశాడు. సరైన స్నేహితులు లేకపోతే మంచివారు కూడా చెడ్డవారుగా మారతారు. బాణాసురుడి చెడు సహవాసంతో నరకుడు అనేక విధాల లోక కంటకుడుగా తయారయ్యాడు. పదహా వేల మంది రాకుమార్తెలను బందీలను చేశాడు.

బాణాసురుడు నరకుణ్ణి కామాఖ్యాదేవి పూజల నుంచి దూరం చేయటమేగాక, కామాఖ్యాదేవి కన్య అనీ, నరకుడు కావాలంటే ఆమెని పెళ్ళి చేసుకోవచ్చునీ ప్రోత్సహిస్తాడు. ఈ సందర్భంగా కామాఖ్యకూ, నరకుడికీ మధ్య జరిగిన పందెంలో నరకుడు ఓడిపోతాడు.

కామాఖ్య అక్కడనుంచి అదృశ్యమయిపోతుంది.

కొంత కాలం తర్వాత నరకుడు ఇంద్రుడి మీద దండెత్తి ఇంద్రుడి తల్లి అయిన అదితి కర్ణ కుండలాలని అపహరించాడు.

ఆ సమయంలో విష్ణువు, భూదేవి.. కృష్ణ, సత్యభామల అవతారాలెత్తి వున్నారు. కృష్ణుడు సత్యభామా సమేతంగా నరకాసురుడి మీదకు యుద్ధానికి వెళ్ళాడు. ఆ యుద్ధంలో సత్యభామ శ్రీకృష్ణుడికి సహాయంగా నిలిచి నరకాసురుణ్ణి వధిస్తుంది.

ఆ విధంగా నరకాసురుడు తల్లి చేతిలోనే మరణిస్తాడు. విషయం తెలుసుకున్న సత్యభామ తన పుత్రుని పేరైనా కలకాలం నిలిచి వుండేలా చేయమని కృష్ణుడిని ప్రార్థించటంతో ఆ రోజు నరక చతుర్దశిగా పిలువబడుతుందని వరం ప్రసాదిస్తాడు శ్రీకృష్ణుడు.

నరకాసురుని వధతో తమ కష్టాలు తొలిగిపోయాయని సంతోషించి మరునాటి నుంచీ అందరూ దీపాలను వెలిగించి సంబరాలను జరుపుకోవటం మొదలైంది. సత్యభామ కోరిక మీద, శ్రీకృష్ణుని వరంవల్ల అప్పటి నుంచీ అందరూ దీపావళి ముందు రోజు నరక చతుర్దశిగా జరుపుకుంటున్నారు. దీపావళి పండుగకీ, రామాయణానికీ కూడా సంబంధం వుంది. రామాయణం ప్రకారం లంకలో రావణుడిని సంహరించిన తర్వాత శ్రీరాముడు సతీ సమేతంగా అయోధ్యకు తిరిగి వచ్చినప్పుడు కూడా ప్రజలు ఆనందోత్సవాలతో దీపావళి జరుపుకున్నారు.



చీకటిని పారదోలుతూ వెలుగులు తెచ్చే పండుగగా, విజయానికి ప్రతీకగా జరుపుకునే ఈ పండుగలో దీప మాలికల శోభతో వెలుగొందే గృహాలు, ఆనంద కోలాహలంతో వెల్లివిరిసే ఆబాల గోపాలం, నూతన వస్త్రాల రెపరెపలు, పిండివంటల ఘుమఘుమలు, బాణసంచా చప్పుళ్లు... ఇవన్నీ దివ్య దీపావళి సోయగాలు. ఈ సంబరాలు ఒక్కరోజే వుంటే ఎలా? మరి ఈ పండుగని ఇంకా ఎన్ని రోజులు జరుపుకుంటారంటే..

## ఐదు రోజుల పండుగ

కొన్ని ప్రాంతాల్లో దీపావళిని ఐదు రోజుల పండుగగా జరుపుకుంటారు. ఆశ్వయుజ బహుళ త్రయోదశితో ప్రారంభమైన దీపావళి వేడుకలు, కార్తిక శుద్ధ విదియ భగినీ హస్త భోజనంతో ముగుస్తుంది. ఈ ఐదు రోజులూ ఏం చేస్తారంటే–

## ధన త్రయోదశి

ఆశ్వయుజ బహుళ త్రయోదశినే ధన త్రయోదశిగా జరుపుకుంటారు. కొత్తగా కొన్న వెండి, బంగారు ఆభరణాలు ఈ రోజున పూజలో పెడితే ధనలక్ష్మి అష్టైశ్వర్యాలూ ప్రసాదిస్తుందని కొందరి విశ్వాసం. అందుకే వాటిని దేవుని దగ్గర పెట్టి, ధనలక్ష్మి, కుబేరులను భక్తి శ్రద్ధలతో కొలుస్తారు.

అమృతం కోసం దేవతలు క్షీరసాగర మథనం చేసినప్పుడు ధన త్రయోదశి రోజునే లక్ష్మీదేవి ఉద్భవించినట్లు పురాణాలు పేర్కొంటున్నాయి. అందువల్ల ధన త్రయోదశి రోజున లక్ష్మీ పూజ.

అలాగే ఇంటిని దీపాలతో అలంకరించటానికి మట్టి ప్రమిదలు, నువ్వుల నూనె వాడటం మంచిది. లక్ష్మీదేవికి ఇష్టమైన నువ్వుల నూనెతో దీపాలు వెలిగిస్తే అమ్మ అనుగ్రహం లభిస్తుంది.

ప్రదోష సమయంలో లక్ష్మీదేవి పూజ చేస్తారు. కొందరు వ్యాపారస్తులు లక్ష్మీ పూజకి కూడా ముహూర్తాలు చూస్తారు. అవి ఒక్కో సంవత్సరం ఒక్కో విధంగా వుంటాయి. దీపావళి రోజున లక్ష్మీ పూజతో తమ వ్యాపారం వృద్ధి చెందుతుందని వ్యాపారస్తులు నమ్ముతారు.

## ధన్వంతరి జయంతి

ఈ ధనత్రయోదశి రోజునే ఆరోగ్యానికి, ఔషధాలకి అధిపతి అయిన ధన్వంతరి జయంతి కూడా. ఆయన కూడా క్షీరసాగర మథనంలో లక్ష్మీదేవి, వగైరా దివ్య శక్తులతో పాటు ఒక చేతిలో అమృత భాండం, మరొక చేతిలో ఆయుర్వేద గ్రంథంతో పాల సముద్రం నుంచి ఉద్భవించాడు. అందుకే ఆరోగ్యం కోసం ఈ రోజు ధన్వంతరిని కూడా పూజిస్తారు. ఆయన శ్రీమన్నారాయణుని అంశ అని, ఆయనను పూజిస్తే లక్ష్మీదేవి సంతోషించి అనుగ్రహిస్తుందని అంటారు.

## నరక చతుర్దశి

దీపావళి ముందు రోజు నరక చతుర్దశి. ఆ రోజు రాత్రంతా గంగాళాలలో నిలవ వున్న నీటిలో లక్ష్మీదేవి ప్రవేశిస్తుందని కొన్ని ప్రాంతాలవారి నమ్మకం. అందుకే ముందు రోజు రాత్రే పెద్ద పెద్ద పాత్రలలో నీరు నింపి వుంచుతారు. ఆడపడుచులు పుట్టింటికి వచ్చి అన్నదమ్ములకు నువ్వుల నూనెతో తలంటి, హారతి ఇచ్చిన తర్వాత ఆ నీటితో అభ్యంగన స్నానాలు చేయిస్తారు.

ఈ సమయంలో అన్నదమ్ములు ఆడపడుచులకు ఆశీస్సులు, కానుకలు అందజేస్తారు. ఆ విధంగా ఈ పండుగకి కుటుంబ సభ్యులంతా కలుస్తారు.

## దీపావళి

నరక చతుర్దశి మరునాడు దీపావళి. తెలంగాణలో దీనిని దివ్వెల పండగ అని కూడా అంటారు. ఇక్కడివారు మూడు రోజుల పాటు బొమ్మల కొలువు కూడా పెడతారు.



తెలంగాణాతో పాటు ఆంధ్ర ప్రాంతాల్లో కొన్ని చోట్ల ఈ పండుగ అయిదు రోజులు చేసుకుంటారు. ఇళ్ళనే కాక ప్రధాన భవనాలని, వీధులను విద్యుద్దీపాలతో అందంగా అలంకరిస్తారు.



## బలిపాడ్యమి

దీపావళి మర్నాడు బలిపాడ్యమి. విష్ణుమూర్తి చేత పాతాళానికి అణిచివేయబడిన బలి చక్రవర్తి మళ్ళీ భూమ్మీదకి తిరిగి వచ్చిన రోజు. ఆయనకి పూజలు చేస్తారు. మహారాష్ట్ర వాసులు ఈ రోజును నవ దివస్‌గా భావిస్తారు. గుజరాతీయులకు ఇది ఉగాది. నందగోపాలుడు గోవర్ధన గిరినెత్తి రేపల్లె వాసులను కాపాడిన రోజు ఇదే.

## భగినీహస్త భోజనం

కార్తిక శుక్ల విదియను యమ ద్వితీయ, భాయిదూజ్‌గా జరుపుకుంటారు. ఆ రోజు సోదరులు తమ సోదరి చేతి భోజనం తింటే అపమృత్యు భయాలు తొలగిపోతాయని నమ్మకం. సూర్యభగవానుడి కుమారుడు యముడు, అతడి సోదరి యమున. యమున తన సోదరుణ్ణి ఎంతగానో అభిమానించేది. అన్నని తమ ఇంటికి ఎన్ని సార్లు ఆహ్వానించినా ఆయన తన పనులతో రాలేకపోయాడు.

చివరికి విసిగిన యమున ఒక రోజు తప్పనిసరిగా తన ఇంటికి రావాలని అన్న దగ్గర వాగ్దానం తీసుకుంది. ఆ రోజే కార్తిక శుక్ల విదియ. చెల్లెలు కోరికను నెరవేరుస్తాడు యముడు. అన్నని సాదరంగా ఆహ్వానించి, స్వయంగా వండిన పదార్థాలను ప్రేమతో కొసరి కొసరి వడ్డించింది. సోదరి ఆతిథ్యానికి సంతోషించిన యముడు ఆమెను వరం కోరుకోమన్నాడు. ప్రతి యేటా ఆ విధంగానే వచ్చి తన ఇంట విందు స్వీకరించమని కోరింది యమున. సోదరీ, సోదరుల మధ్య ఆప్యాయతకు ఈ పర్వదినం నాంది పలికింది. అంతేకాదు, ఆ రోజు భగినీ హస్త భోజనం చేసిన వారికి అప మృత్యు భయం వుండదని యమధర్మరాజు వరమిచ్చాడంటారు. మరి ఇంత దివ్యమైన పండుగను మనమే కాదు. చాలా ప్రాంతాల వారు చేసుకుంటారు. వాళ్ళెలా చేసుకుంటారో చూద్దామా

## దివ్వి దివ్వి దీపావళి

కొన్ని ప్రాంతాలవారు సాయంత్రం ప్రదోష సమయంలో గోంగూర మొక్కలకి చిన్న చిన్న గుడ్డ ముక్కలు కట్టి వెలిగించి చిన్న పిల్లలచేత దక్షిణ దిశగా గుండ్రంగా తిప్పిస్తారు. దీనినే ఉల్కాదానం అంటారు. ఈ దీపం పితృదేవతలకు దారి చూపుతుందని శాస్త్రాలు చెబుతున్నాయి. ఆ దీపం వెలిగించిన తర్వాత కాళ్లు కడుక్కుని ఇంట్లోకి వచ్చి తీపి తింటారు. తర్వాత పూజాగృహంలో నువ్వుల నూనెతో ప్రమిదలు వెలిగించి దీపలక్ష్మికి నమస్కరించి ఉత్సాహంగా బాణసంచా కాలుస్తారు. బాణసంచాల వెలుగులో, శబ్ద తరంగాల హోరులో దారిద్ర్య దుఃఖాలు దూరంగా తరిమివేయబడి లక్ష్మీదేవి కటాక్షం లభిస్తుందని చెప్తారు. అంతేకాదు, వర్షఋతువులో ఏర్పడే తేమవల్ల పుట్టుకువచ్చే క్రిమికీటకాలు బాణసంచా పొగకి, ఆ వాసనలకీ నశించి ఆరోగ్యకరమైన వాతావరణం ఏర్పడుతుందని అంటారు. ఇది ఇదివరకు. ప్రస్తుతం భూమి మీద వున్న అనేక రకాల కాలుష్యాలతో సతమతమవుతున్న మానవులకి ఈ మందుగుండు సామాను వదిలే ఘాటైన వాసనలూ, పొగలూ ఇంకా అనారోగ్యాలని కలుగచేస్తాయి. ఏ పండగకైనా ఇంటిని శుభ్రం చేసుకోవటం, అభ్యంగన స్నానాలు, పిండి వంటలు, బంధు మిత్రులు, కొత్త బట్టలు అవకాశం వున్నంతమటుకూ మామూలే. కానీ ఆచార వ్యవహారాలు వివిధ ప్రాంతాలలో వివిధ రకాలుగా వుంటాయి కదా. వివిధ ప్రాంతాలవారి దీపావళినీ చూసివద్దాం.

**బుందేల్ ఖండ్‌లోని** కొన్ని ప్రాంతాల్లో దీపావళి రోజున రావణ దహనం చేస్తారు. వారణాసిలో దీపావళి చాలా బాగా జరుపుతారు. దీపావళి సమయాన గంగానదికి, విశ్వనాథుడికి హారతులు ఇస్తారు. ఐదు రోజుల పాటు జరిగే ఈ పండుగలో చివరి రోజున దేవ దీపావళి నిర్వహిస్తారు. సుమారు పది లక్షలకు పైగా వెలిగించిన మట్టి ప్రమిదలను భక్తులు గంగా నదిలో వదులుతారు.

దేశ రాజధాని **ఢిల్లీలో** రామ్ లీలా మైదాన్‌లో రాముని జీవితం ప్రతిబింబించే చిత్రాలను ప్రదర్శిస్తారు. భారీ కటౌట్‌లతో కళకళలాడే ఈ మైదానంలో ఉత్సవాలు చూడటానికి జనం గుంపులు గుంపులుగా తరలి వస్తారు.

పంజాబ్ రాష్ట్రంలోని **అమృతసర్‌లో** స్వర్ణ దేవాలయాన్ని దీపాలతో పూర్తిగా అలంకరిస్తారు. ప్రజలు మట్టి ప్రమిదలను వెలిగించి భక్తి శ్రద్ధలతో దైవాలను పూజిస్తారు.

**పశ్చిమ బెంగాల్‌లో** దీపావళి వేడుకలు విభిన్నంగా వుంటాయి. ఇక్కడ కాళీమాతను శక్తివంతమైన దేవతగా పరిగణించి పూజలు నిర్వహిస్తారు. ఆలయంలో పూజలను, నైవేద్యాలను వారు అర్ధరాత్రి సమయంలో నిర్వహిస్తారు.

**గోవాలో** ఈ పండుగని దియాంచి ఆలిగా జరుపుకుంటారు. దీపాలే కాకుండా ప్రతి ఇంటిలో ఆకాశ దీపాలను వెలిగిస్తారు. వీటిని వారి ఇంటి కిటికీలకు వేలాడకడతారు. దీపావళి వేడుకలలో బాణసంచా కాల్చడం మొదలైంది **గుజరాత్‌లో**.

వీరు నరక చతుర్దశిని ధన్‌తెరాస్ అంటారు. ఆ రోజు లక్ష్మీ పూజ చేసి కొత్త గుజరాత్ సంవత్సరాన్ని ప్రారంభిస్తారు. నరక చతుర్దశి రోజున బంగారం కొనటం శుభప్రదంగా భావిస్తారు. మూడవ రోజున భాయ్ బీజా అంటారు.



**మహారాష్ట్రలో** ఈ పండుగ అయిదు రోజులు జరుపుకుంటారు. ఒక ఆవుకు, దాని దూడకు హారతి ఇవ్వటంతో పండుగ మొదలు పెడతారు. అమావాస్యనాడు ఇంట్లోని లక్ష్మీదేవి విగ్రహం వద్ద ఆభరణాలను వుంచి పూజిస్తారు. పిండివంటలు తాము తినటమేకాక ఇరుగు పొరుగుకి పంచి పెడతారు. రాత్రికి బాణసంచా కాలుస్తారు.

**ఒరిస్సాలో** ఈ పండగను పెద్దల పండగగా ఆచరిస్తారు. తమ పూర్వీకులు ఈ అమావాస్య రోజున ఆకాశంలో వచ్చి విహరిస్తారని భావిస్తారు. వారి ఆత్మ శాంతికి, మోక్షం కలిగేందుకు వెలుగులు చూపాలని బాణసంచా కాలుస్తారు. ఇది వీరి పండగలో ప్రధాన అంశం. లక్ష్మీదేవికి, కాళీమాతకి పూజలు చేస్తారు.

**తమిళనాడులోని** శివకాశి అనే పట్టణంలో బాణాసంచా తయారుచేసే పరిశ్రమలు అధికంగా వున్నాయి. దీపావళి సమయంలో దేశం మొత్తం సరఫరా అయ్యే బాణాసంచాలో 75 శాతం ఇక్కడ తయారు చేసినవే.

## విదేశాలలో..

మన దేశం నుంచి వెళ్ళిన మనవారే కాకుండా వివిధ దేశాలవారు కూడా ఈ పండుగను వివిధ రకాల పేర్లతో, వివిధ కారణాలకి జరుపుకుంటారు.

**జపానులో** ఈ పండుగను తోరో నాగోషి పేరుతో 3 రోజుల పాటు జరుపుకుంటారు. మొదటిరోజు దీపాలు వెలిగించి పితృదేవతలకు కృతజ్ఞతలు తెలుపుతూ వారి ఆశీర్వాదం కోరుకుంటారు. రెండవ రోజు బంధు మిత్రులను కలుస్తారు. మూడవ రోజు పడవల్లో ప్రయాణించి వాళ్ళ ఆనందాన్ని తెలుపుకుంటారు.

**చైనాలో** రంగు రంగుల దీపాలతో ఇళ్ళని అలంకరిస్తారు. ప్రత్యేకంగా శుభం, లాభం గుర్తులు వేస్తారు.

బర్మాలో పశువుల పండుగగా చేస్తారు. అంతేకాదు.. బౌద్ధమతం అవతరించిన రోజుగా వారు సంగీజ్ అనే పండుగని చేసుకుంటారు.

**ఆస్ట్రేలియా వాసులు** లూసియా అనే అమ్మాయి త్యాగనిరతిని గుర్తు చేసుకుంటూ ఈ పండగ చేసుకుంటారు.

**ఇండోనేషియాలో** భారతీయులు అధిక సంఖ్యలో నివసించే బాలి నగరంలో స్థానికులు జరుపుకునే ముఖ్యమైన పండుగల్లో ఇది ఒకటి. భారతదేశంలో జరిగే విధంగానే అన్ని సాంప్రదాయ పద్ధతుల్లో ఇక్కడ దీపావళి పండుగను చేసుకుంటారు.

మన పొరుగు దేశం **నేపాల్‌లో** ఈ పండుగని తిహార్ అని పిలుస్తారు. వీరు కూడా లక్ష్మీ, గణేష్‌లకు దీపావళినాడు పూజలు చేస్తారు. నేపాల్‌లో దీపావళి పండుగను ఐదు రోజులు చేస్తారు. మొదటి రోజు వివిధ వంటకాలు చేసి ఆవుకు పెడతారు. లక్ష్మీదేవి ఆవులో కొలువై వుంటుందని వారి నమ్మకం. రెండవ రోజు భైరవుడి వాహనమైన శునకాలను పూజిస్తారు. వాటికి ప్రత్యేకమైన వంటకాలు చేసి పెడతారు. మూడవ రోజు ఇళ్ళని దీపాలతో అందంగా అలంకరిస్తారు. నాల్గవ రోజు మరణానికి అధిదేవత అయిన యముడిని పూజిస్తారు. ఐదవ రోజు భయ్య దూజ్‌ను జరుపుకుంటారు. అక్క చెల్లెళ్ళ శ్రేయస్సును కోరుకుంటూ సోదరులు ఈ పండుగలో పాల్గొంటారు.



ఇలా.. ఏ పేరుతో పిలిచినా ఏ రాష్ట్రంలోగానీ, ఏ దేశంలోగానీ జరుపుకున్నా పండగ ముఖ్యోద్దేశం తమ శ్రేయస్సు కోసం దేవతా పూజలు, పితృదేవతలకి కృతజ్ఞతలు తెలియజేయటం, పశు పక్ష్యాదులకు కృతజ్ఞత తెలియజేయటం, అంతేకాదు, మన ఆత్మ జ్యోతి వెలగాలనీ, అంధకారంలోంచి వెలుగులోకి నడవాలని కోరుకుంటూ దీపావళి పండుగను జరుపుకుంటారు.

# ఇప్పటికి చాలాసార్లు అనుకున్నాను

ఎంత కుంభవర్షం కురిసినా
ఒక్క నీటి బిందువుని కూడా అంటని
తామరాకు వలే ఉండాలని
ఇప్పటికి చాలా సార్లు అనుకున్నాను.
కానీ, ప్రాపంచిక పలవరింతలనే
వర్షంలో..
తడసి ముద్దవుతూనే వున్నాను.

ఎంత ప్రళయం సంభవించినా
ఒక్క ఉలికిపాటుకి కూడా గురికాని
మౌనయోగి వలె
ఉండాలని ఇప్పటికి చాలాసార్లు
అనుకున్నాను.
కానీ, ప్రేమానుబంధాలనే
సుడిగుండంలో
పడి తల్లడిల్లుతూనే వున్నాను.
ఎంత హోరుగాలి వీచినా
ఒక్క కుదుపుకి కూడా
సడలని విహరించే పక్షి వలె
ఉండాలని ఇప్పటికి చాలాసార్లు అనుకున్నాను.
కానీ, మనుషుల ఈర్ష్యాద్వేషాలనే
వలయంలో
చిక్కి సతమతమౌతూనే వున్నాను.



ఎంత భారం మోపినా
ఒక్క అసహనం కూడా చూపని
భూమి వలె
ఉండాలని..
ఇప్పటికి చాలాసార్లు అనుకున్నాను.
కానీ, జీవన పోరాటాలనే సాగరంలో
మునిగి ఎదురీదుతూనే వున్నాను.

– దేవీప్రసాద్ ఒబ్బు

ఈ వారం కవిత్వం

## నా స్వరం మాత్రమే

పేరు మరుగున పడవచ్చు
ముఖం మారిపోవచ్చు
నా స్వరం మాత్రమే
గుర్తుపట్టగలవు.
ఇంటికి చేరుకోవడానికి
సమయం వేసే శిక్ష
చాలా అందమైనది


ఈ రోజు ఇక్కడ..
రేపు ఎక్కడో తెలీదు
కాలం రెక్కల పైన ప్రయాణం చేసి
ఒకనాడు కలుసుకున్న
నా స్వరం మాత్రమే గుర్తుపట్టగలవు
ఇంటికి చేరుకోవడానికి
గడిచిపోయిన కాలం
నిన్నలలో కలిసిపోయింది
ఇంక సమయం మిగలలేదు
కొన్ని క్షణాలు మిగిలితే
నా స్వరం మాత్రమే గుర్తుపట్టగలవు
ఇంటికి చేరుకోవడానికి

పొద్దు వాలిపోతోంది
చీకటిరాత్రి సమీపిస్తోంది
జీవితం ఇంకా ఎంతోలేదు
ఇల్లు గుర్తుకు వస్తే
మనసు కష్టపెట్టుకోకు
నా స్వరం మాత్రమే గుర్తుపట్టగలవు
ఇంటికి చేరుకోవడానికి

– అరుణ డేనియల్

## ఆశయం!!

తెలుసునా మిత్రమా!
నీవెందుకు ఒంటరైనావో
నడకకు జతలేక పయనానికి దిక్కులేే!
కలల గమ్యం వేటలో
ఆశల రహదారిలో
సొగసైన సవారీతో
పరిగెత్తించిన కోర్కెల
గుర్రాలు హఠాత్తుగా
అపరిచితులైనట్లు
బతుకుబండిని వదిలేసి
తమ దారి తాము
చూచుకొని
ఒక్కటొక్కటిగా అదృశ్యమై
ఏ దూరాలకు
పారిపోయాయో
ఎందుకో ఆలోచించావా ఇప్పటికైనా?
ఉచ్ఛ్వాస నిశ్వాసములకే ఉనికై
ఊపిరికే ఊపిరై ప్రాణంలో ప్రాణమై
యద పొదరింట్లో కొలువై
అతిప్రీతిపాత్రమైన ఆశయం
ఉసురుదీసి జీవచ్ఛవాన్నిజేసి
ఎడంగా ఎందుకు
వెళ్లిపోయిందో
ఎందుకో ఆలోచించావా ఇప్పటికైనా?
జీవితసాఫల్య తీరం దిశకు
భద్రంగా పయనించు జీవననావ
నడిసంద్రపు సంధ్యలో
తొట్రుపాటుతో ముందుకు సాగనంటూ
గమనమేటో



తెల్చుకొమ్మంటూ
బతుకునెందుకు
డోలాయమాన స్థితికి
లంగరేసిందో
ఎందుకో ఆలోచించావా
ఇప్పటికైనా?
మది ఆలోచనా
తరంగాల్లో అమాస
నిశానిరాశల ఒత్తిళ్ళని
ప్రయత్న పోరాట పున్నమి వెలుగుల్లో
అలుపెరగక అధైర్యపడక తరిమేస్తే
కోరుకున్న ఆకాంక్షల గమ్యం వైపుకు
నడకకు దశ దిశ తోడు దక్కేనని
ఇప్పటికైనా ఆలోచించావా??

– రవి కిషోర్ పెంట్రాల

## నీది.. నాది

రేపు..మన దేహమే
మనది కానపుడు
ఏది నీది?
ఏది నాది?
నీది, నాది
అనే వాదులాట
సోదిలోనేమిగులుతుంది.

### అందమైన అబద్ధం

అబద్ధమెప్పుడూ
అందంగా
ముస్తాబవుతోంది.
అందుకే దానికి
ఆకర్షణ ఎక్కువ.

– గాలిశెట్టి వేణుగోపాల్

# స్వేచ్ఛ కోసం పోరాడే ధైర్యానికి 'నోబెల్'

నోబెల్ శాంతి బహుమతి ప్రపంచవ్యాప్తంగా శాంతి, మానవతావాద ప్రయత్నాలకు ఇచ్చే అత్యున్నత అవార్డు. మొదటి నోబెల్ శాంతి బహుమతి 1901లో స్విస్ మానవతావాది హెన్రీ డ్యూనాంట్, ఫ్రెంచ్ శాంతివాది ఫ్రెడెరిక్ పాస్సీకి సంయుక్తంగా లభించింది. జాతుల మధ్య సోదరభావం (సౌభ్రాతృత్వం), సైనిక దళాల తగ్గింపు లేదా రద్దు, శాంతి సమావేశాలను ప్రోత్సహించడం కోసం అత్యుత్తమ కృషి చేసిన వ్యక్తికి లేదా సంస్థకు ఈ శాంతి బహుమతిని ప్రదానం చేస్తారు.

### మచాడో ఎంపిక వెనుక గల ప్రాముఖ్యత



వెనెజులా మాజీ పార్లమెంటు సభ్యురాలు, దేశంలోని ప్రజాస్వామ్య ప్రతిపక్షానికి కీలక నాయకురాలైన ఆమె, రెండు దశాబ్దాలకు పైగా పౌరుల హక్కులను ప్రోత్సహించడానికి చేసిన అవిశ్రాంత పోరాటానికి ఈ గుర్తింపు లభించింది.

మచాడోకు బహుమతి రావడం వెనెజులాకే కాక, ప్రపంచంలోని నిరంకుశ పాలకులందరికీ ఒక గట్టి హెచ్చరిక. వెనెజులాలో ప్రజాస్వామ్యాన్ని అణచివేసే ప్రయత్నం జరుగుతున్న ఈ సమయంలో, ఈ నోబెల్ గుర్తింపు చాలా ముఖ్యమైనది. క్యూబా, నికరాగ్వా, బెలారస్ వంటి నిరంకుశ దేశాలలో స్వేచ్ఛ కోసం పోరాడే ప్రతి సాధారణ పౌరుడికీ ఇది ఒక గొప్ప ఆశాదీపం.

### మచాడో తొలి జీవితం-రాజకీయ రంగప్రవేశం

మారియా కొరీనా మచాడో 1967 అక్టోబరు 7న వెనెజులా రాజధాని కారాకస్‌లో ఒక ఉన్నత వర్గానికి చెందిన కుటుంబంలో జన్మించారు. ఆమె తండ్రి హెన్రిక్ మచాడో జులోగా, వెనెజులా ఉక్కు పరిశ్రమలో ప్రముఖ వ్యాపారవేత్త. వారి కుటుంబానికి పౌర, మేధో జీవితంలో చురుకుగా పాల్గొన్న నేపథ్యం ఉంది. ఈ నేపథ్యం ఆమెలో నిరంకుశ పాలనపై వ్యతిరేకతను పెంపొందించడానికి ప్రేరేపించింది. విద్యాభ్యాసం విషయానికి వస్తే, ఆమె కారాకస్‌లోని ఆండ్రెస్ బెల్లో కాథలిక్ విశ్వవిద్యాలయం నుండి పారిశ్రామిక ఇంజనీరింగ్‌లో డిగ్రీని పూర్తి చేశారు. ఆ తరువాత ఫైనాన్స్‌లో మాస్టర్స్ డిగ్రీని అభ్యసించారు. 2009లో ఆమె మొదట 1992లో వీధిలో నివసించే అనాథ పిల్లల సంరక్షణకు అంకితమయ్యే 'అటెనియా ఫౌండేషన్'ను స్థాపించారు. మచాడో క్రియాశీలత వైపు మొగ్గు చూపడానికి ప్రధాన కారణం వెనెజులాలో హ్యూగో చావెజ్ నాయకత్వంలో పెరుగుతున్న నిరంకుశత్వం, సంస్థాగత పతనమే. 1999లో చావెజ్ అధికారం చేపట్టిన తర్వాత వెనెజులా రాజకీయ, ఆర్థిక వ్యవస్థలో తీవ్రమైన మార్పులు వచ్చాయి. చావెజ్ పాలన పౌర సంస్థలు, మీడియా, ఎన్నికల వ్యవస్థపై తమ నియంత్రణను క్రమంగా పెంచుకుంటూ వచ్చింది. దీనివల్ల దేశంలో ప్రజాస్వామ్య ప్రక్రియల విశ్వసనీయత, పారదర్శకత ప్రశ్నార్థకమైంది. పెరుగుతున్న ఎన్నికల మోసంపై అనుమానాలు, ఆమె కుటుంబ వ్యాపారం జప్తు కావడం మచాడో రాజకీయ క్రియాశీలతకు ముఖ్య కారకాలుగా దారితీశాయి. చావెజ్ ప్రభుత్వం ఆమె కుటుంబానికి చెందిన ఉక్కు, రీబార్ తయారీ సంస్థతో సహా అనేక ప్రైవేట్ సంస్థలను జప్తు చేసింది. ఈ చర్య ఆమెకు పాలనా నియంత్రణ విధానాలు, ఆస్తి హక్కుల ఉల్లంఘన తీవ్రతను ప్రత్యక్షంగా అనుభవంలోకి తెచ్చింది.

### శాంతియుత ప్రజాస్వామ్య ఉద్యమం-నిరంతర ప్రతిఘటన

మారియా కొరీనా మచాడో పోరాటం వెనెజులాలో ప్రజాస్వామ్యాన్ని, స్వేచ్ఛను, చట్ట పాలనను తిరిగి తీసుకురావడానికి హ్యూగో చావెజ్, నికోలస్ మదురో నిరంకుశ పాలనలకు వ్యతిరేకంగా సాగించిన నిరంతర, ధైర్యంతో కూడిన పోరాటం. 2002లో ఎన్నికల పారదర్శకతను ప్రోత్సహించడంపై దృష్టి సారించిన ప్రభుత్వేతర సంస్థ అయిన 'సుమటే' ను ఆమె సహ స్థాపించారు. తద్వారా ఆమె రాజకీయ పోరాటంలోకి అధికారికంగా ప్రవేశించారు. ఈ సంస్థ స్వేచ్ఛాయుతమైన, నిష్పాక్షికమైన ఎన్నికలను ప్రోత్సహించడానికి అంకితమైంది. 2013లో ఆమె 'వెంటే వెనెజులా' పార్టీని స్థాపించి, స్వేచ్ఛా మార్కెట్లు, పౌర భాగస్వామ్యం, సంస్థాగత సంస్కరణల కోసం పోరాడారు. 2014లో జాతీయ అసెంబ్లీ సభ్యురాలిగా ఉన్నప్పుడు, ఆమె ఆర్గనైజేషన్ ఆఫ్ అమెరికన్ స్టేట్స్ వద్ద మానవ హక్కుల ఉల్లంఘనలను ఖండించడానికి ప్రయత్నించిన వెంటనే, పాలన ద్వారా ఏకపక్షంగా ఆమె పదవి నుండి తొలగించబడ్డారు. అంతేకాక, ఆమె ప్రయాణాలు నిషేధించబడ్డాయి. ప్రజా పదవులను నిర్వహించకుండా ఆమెను పదేపదే ప్రభుత్వం అడ్డుకుంది.

తన రాజకీయ కార్యకలాపాల కోసం, నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా కఠినమైన అంతర్జాతీయ స్పందన కోసం ఆమె చేసిన పిలుపుల కారణంగా దేశద్రోహ ఆరోపణలతో సహా అనేక ఆరోపణలను ఆమె ఎదుర్కొన్నారు.

వెనెజులా 'ఐరన్ లేడీ'గా గుర్తింపు పొందిన ఆమె, దేశవ్యాప్తంగా జరిగిన తన ర్యాలీలకు భారీ జనసమూహాలను ఆకర్షించడంలో విజయం సాధించారు. తాను పోటీ చేయకుండా అడ్డుకున్నప్పటికీ, ఆమె వెంటనే ప్రత్యామ్నాయ ప్రతిపక్ష అభ్యర్థి ఎడ్మండో గొంజాలెజ్ ఉర్రుటియాకు మద్దతు ఇవ్వడం ద్వారా రాజకీయ పరిణతిని ప్రదర్శించారు. ప్రభుత్వం తన సొంత విజయాన్ని ప్రకటించిన తర్వాత కూడా, ఆమె వెనెజులా ప్రజల ప్రజాస్వామ్య హక్కుల కోసం, శాంతియుత పరివర్తన కోసం తన అవిశ్రాంత న్యాయపోరాటాన్ని కొనసాగిస్తున్నారు.

## మచాడో లక్ష్యాలు - సాధించిన విజయాలు

మారియా కొరీనా మచాడో లక్ష్యాలను రెండు ప్రధాన విభాగాలుగా చూడవచ్చు.



తక్షణ రాజకీయ లక్ష్యం, అంటే నికోలస్ మదురో నిరంకుశ పాలన నుండి సంపూర్ణ ప్రజాస్వామ్యం వైపు శాంతియుత పరివర్తన తీసుకురావడం, ఇంకా పూర్తి కాలేదు. 2024 ఎన్నికల తర్వాత కూడా మదురో పాలన అధికారంలో కొనసాగడం, ఎన్నికల ఫలితాలను తమకు అనుకూలంగా ప్రకటించుకోవడంతో పాటు, మచాడో అభ్యర్థిత్వాన్ని రద్దు చేయడం వంటి చర్యలు ఈ లక్ష్యానికి ప్రధాన ఆటంకాలుగా నిలిచాయి.

మరోవైపు ఆమె నైతిక, దీర్ఘకాలిక లక్ష్యం పాక్షికంగా నెరవేరింది. తీవ్రమైన అణచివేత ఉన్నప్పటికీ వెనెజులాలోనే ఉండాలనే ఆమె నిర్ణయం, ప్రజలలో మార్పుపై ఆశ, విశ్వాసం మళ్లీ చిగురించేలా చేసి, పౌర సమాజ ధైర్యాన్ని పెంచింది. దీని ద్వారా ఆమె ప్రజాస్వామ్య స్ఫూర్తిని పునరుద్ధరించగలిగారు. అంతేకాకుండా ఆమె నాయకత్వం ప్రతిపక్షాన్ని చట్టబద్ధమైన బహుళ మెజారిటీ ప్రజలకు ప్రాతినిధ్యం వహించే శక్తిగా అంతర్జాతీయ వేదికలపై నిలబెట్టింది. తుది రాజకీయ లక్ష్యాన్ని ఇంకా సాధించనప్పటికీ, నోబెల్ శాంతి బహుమతి ప్రతిపాదన, ఐక్య ప్రతిపక్షం, కోట్లాది మంది ప్రజల మద్దతు ద్వారా ఆమె ఒక బలమైన నైతిక, అంతర్జాతీయ రాజకీయ విజయాన్ని సాధించి, ప్రజాస్వామ్య స్ఫూర్తిని సజీవంగా ఉంచారు.

## మచాడో పోరాట ప్రాముఖ్యత –నోబెల్ రక్షణ

మచాడోకు ఈ బహుమతి ఇవ్వడం కేవలం ఆమె ఒక్కరికే దక్కిన గౌరవం కాదు. అన్యాయానికి వ్యతిరేకంగా పోరాడుతున్న లక్షలాది వెనెజులా ప్రజలందరికీ దక్కిన గౌరవం. ఆ దేశంలో అణచివేత రాజ్యమేలుతున్నప్పటికీ, ఆమె స్వేచ్ఛ అనే దీపాన్ని ఆరిపోకుండా కాపాడుతున్నారు. అందుకే, ఆమెను "ధైర్యంగా శాంతికి కృషి చేసే వ్యక్తి" అని కమిటీ కొనియాడింది. ఈ బహుమతితో, రాజకీయంగా కష్టాలు ఉన్న చోట, సరియైన న్యాయం, మానవ హక్కులు కావాలని పోరాడే వారి ప్రయత్నం కూడా ఒక గొప్ప శాంతి పని అవుతుందని నోబెల్ కమిటీ స్పష్టం చేసింది. ఆమె పోరాటం దేశంలో అణచివేతను తగ్గించాలని, ప్రజల మధ్య సఖ్యత పెరగాలని, సరైన ఎన్నికలు జరగాలని కోరుకుంటుంది.

ఈ అవార్డు మచాడోకు ఒక రక్షణ కవచం లాంటిది. ఒక నోబెల్ శాంతి గ్రహీతను అరెస్టు చేయడం లేదా హింసించడం అంటే ప్రపంచ దేశాల అభిప్రాయాన్ని ఏ మాత్రం పట్టించుకోనట్లే. ఏ నియంత అయినా సరే అంతర్జాతీయంగా ఇంత పెద్ద విమర్శను భరించడం కష్టం. ప్రపంచ మీడియా అంతా ఇప్పుడు ఆమెను గమనిస్తుంది. ఇక్కడ జరిగే హింస వ్యవస్థాగతమైనది; అంటే, ప్రభుత్వం అవినీతి, తప్పుడు నిర్ణయాల ద్వారా ప్రజల హక్కులను తొక్కివేస్తోంది, వారి ప్రశ్నించే హక్కును లాగేసుకుంటోంది. అందుకే అక్కడ నిజమైన శాంతి లేదని అర్థం.

## ఇకపై చేయవలసినవి

ఇది ఒక కొత్త ప్రారంభం. ఈ గుర్తింపును వాడుకుని, వెనెజులాలో మార్పు తీసుకురావడానికి ప్రపంచ దేశాలు గట్టిగా ప్రయత్నించాలి. మొదటగా మచాడోకు, ఆమె బృందానికి ఎటువంటి ప్రమాదం జరగకుండా చూడాలి. ఆ తర్వాత ఈ నోబెల్ గుర్తింపును ఉపయోగించి వెనెజులాలో స్వేచ్ఛాయుత, నిజమైన ఎన్నికలు జరిగేలా అంతర్జాతీయ ఒత్తిడి తేవాలి. ఈ ఉత్సాహం కేవలం ప్రశంసలతో ఆగిపోకూడదు. నోబెల్ బహుమతితో వచ్చే డబ్బును వెనెజులాలోని పౌర సంస్థలకు, నిజాలు రాసే జర్నలిస్టులకు, మానవ హక్కుల కోసం పనిచేసే వారికి ఇవ్వాలి. దానివల్ల దేశంలో శాంతియుత మార్పు కోసం పనిచేసే వారికి బలం పెరుగుతుంది.

ఇకపై ప్రపంచంలోని అన్ని దేశాలు కలిసి మచాడోను ఆమె దేశ రాజకీయాల్లో స్వేచ్ఛగా పాల్గొననివ్వాలని వెనెజులా ప్రభుత్వాన్ని డిమాండ్ చేయాలి. శాంతి అనేది ఆయుధాలు లేకపోవడంలో కాదు, నిజమైన ధైర్యం, ఆత్మవిశ్వాసం ఉన్న మనుషుల నైతిక శక్తిలో ఉందని ఆమె నిరూపించారు. నోబెల్ శాంతి బహుమతి అనేది ఆమె ఒక్కరికే కాదు. స్వేచ్ఛా వెనెజులాను కోరుకునే ప్రతి పౌరుడికీ దక్కిన గౌరవం. ఆమె కాపాడుతున్న ప్రజాస్వామ్యం అనే జ్యోతి, వెనెజులా దేశం మొత్తాన్ని వెలిగించే వరకు ఈ అంతర్జాతీయ గుర్తింపు ఆమె పోరాటానికి బలాన్నిస్తుంది.

– డి.జె. మోహన రావు

# కాలయానంలో ఉత్తరాల రూపాంతరాలు

**మనిషి సంభాషణా పద్ధతులు అనేక రూపాల్లో కాలక్రమేణా మారిపోయాయి. మాటలతో మొదలైన ఆ ప్రయాణం, ఆలోచనలను దూరంలో ఉన్నవారికి చేరవేయాలనే తపనతో కొత్త కొత్త మార్గాలను సృష్టించుకుంది. ఈ మార్పులను వెనక్కి చూసినపుడు, మనిషి సృజనాత్మకతకు, సమాజ అభివృద్ధి పట్ల అతని ఆసక్తికి అద్దం పడుతుంది.**

పూర్వకాలంలో రాజులు ఒకరికి ఒకరు పంపే సందేశాలను పావురాల ద్వారా పంపించేవారు. ఆకాశంలో ఎగిరే ఆ తెల్లని పావురం, తన కాళ్లకు కట్టిన చిన్న చీటీని గమ్యస్థానానికి తీసుకెళ్లినపుడు, అది కేవలం సమాచారాన్ని మాత్రమే కాదు, నమ్మకాన్ని, భద్రతను, వేగాన్ని కూడా సూచించేది. ఆ యుగంలో పావురం ఒక జీవంతమైన దూత. మనిషి చేతిలో అప్పట్లో యంత్రం ఏదీ లేకపోయినా, ప్రకృతిని స్నేహితుడిగా మార్చుకొని సమాచారాన్ని పంచుకునే జ్ఞానం మాత్రం ఉంది.



కాలం గడిచే కొద్దీ పావురాల ప్రాధాన్యత తగ్గిపోయింది. తపాలా వ్యవస్థ ఆ స్థానాన్ని ఆక్రమించింది. లేఖలు చేతివ్రాతతో రాసి, లేఖపత్రంలో మడిచి, పిన్ని చుక్కల్లా గుర్తు పెట్టిన స్టాంప్‌తో, దూర ప్రాంతాల వారికి పంపేవారు. ఆ లేఖలో అక్షరాలు మాత్రమే కాకుండా, మనసు నిండా పొంగిన భావాలు కూడా చేరేవి. ఎంత దూరంలో ఉన్నవారైనా, ఆ లేఖ చదివినప్పుడు దగ్గరగా ఉన్నట్టే అనిపించేది. తపాలా బండి, పోస్టుమెన్.. ఇవన్నీ ఒక యుగాన్ని నిలబెట్టాయి.

ఆ తర్వాత మానవ సమాజం సాంకేతిక యుగం వైపు అడుగుపెట్టింది. పేజర్ అనే చిన్న పరికరం వచ్చి, కొన్ని సంఖ్యలు, అక్షరాల రూపంలో సందేశాలను అందించసాగింది. అది అప్పట్లో ఒక విప్లవం. ఒక్క క్షణంలో సమాచారం చేరడం అంటే అద్భుతమే. పేజర్ నుంచి టెలిఫోన్ దిశగా ప్రయాణం మరింత వేగవంతమైంది. టెలిఫోన్‌లో గంట మోగగానే, కిలోమీటర్ల దూరంలో ఉన్న వారితో ముఖాముఖి మాట్లాడుతున్న భావన కలిగేది. ఇది ఒక కొత్త అనుభూతి.

అదే వేగం మనల్ని కంప్యూటర్ యుగానికి తెచ్చింది. ఈమెయిల్ రూపంలో సందేశాలు సెకన్లలోనే ప్రపంచం చుట్టేసాయి. కాగితం అవసరం లేకుండా, కలం అవసరం లేకుండా, వేలిముద్రలతోనే అక్షరాలు ఎగిరిపోతూ ఒకరి మనసు మరొకరికి చేరాయి. కొద్దికాలానికే వాట్సాప్, జనరల్ మెసేజెస్ అనే సౌకర్యాలు మొబైల్ ఫోన్‌లలో చోటు చేసుకున్నాయి. ఒక నిమిషంలో వందలాది మందికి సమాచారం చేరే అవకాశాన్ని తెచ్చాయి.

ప్రస్తుతం ఈ మార్పులు మరింత ముందుకు దూసుకెళ్లాయి. ఫోన్ సంభాషణలు, సెల్ఫోన్ చాట్‌లు మాత్రమే కాకుండా, వీడియో కాలింగ్, వీడియో సందేశాలు మన జీవితంలో భాగమయ్యాయి. కేవలం మాటలు మాత్రమే కాకుండా, ముఖ కవళికలు, స్వరానుభూతులు, మనసులోని హృదయ స్పందనలతో కూడిన అనుభవం కూడా అందులో చేరింది.

ఈ వరుసలో, ప్రస్తుతం ఊహాజనితమైన కృత్రిమ మేధస్సు (ఏఐ) కూడా సంభాషణ పద్ధతుల్లో విప్లవాత్మక మార్పులు తెస్తోంది. మనమే రాయకుండానే ఏఐ మన తరపున ఉత్తరాలు రాసి పంపగలుగుతోంది. మన మాటలు వినగానే అవి అర్థం చేసుకుని, మన ఉద్దేశాన్ని మరొకరికి చేరవేయగలుగుతోంది. పూర్వం పావురం కాళ్లకు కట్టి పంపిన చిన్న చీటీ, నేడు మేఘంలో నిల్వైన ఒక డిజిటల్ ఫైల్‌గా మారిపోయింది.

ఈ మార్పులను గమనిస్తే ఒక నిజం స్పష్టమవుతుంది. సమాచార మార్పిడి పద్ధతులు ఎంతమాత్రం అభివృద్ధి చెందినా, మనిషి తన భావాలను మరొకరికి చేరవేయాలనే కోరిక మాత్రం యుగయుగాల నుంచి అదే రీతిలో కొనసాగుతోంది. పావురాల నుండి ఏఐ వరకు వచ్చిన ఈ ప్రయాణం, మనిషి ఆవిష్కరణా సామర్థ్యానికి నిదర్శనం. రేపటి రోజుల్లో మరెన్ని ఊహించని మార్పులు ఎదురైనా, ఈ సంభాషణ తపన ఎప్పటికీ నిలిచిపోతూనే ఉంటుంది.

## సంభాషణల మార్పు- భవిష్యత్ దిశలు

మనిషి చరిత్రను విపులంగా పరిశీలిస్తే, ప్రతి దశలోనూ సమాచార మార్పిడి పద్ధతులు కాలానికి తగ్గట్టు కొత్త రూపాలు దాల్చడం గమనించవచ్చు పూర్వం లేఖలు, పేజర్లు, టెలిఫోన్‌లు, ఈమెయిల్లు అన్నీ వేర్వేరు యుగాల ప్రతీకలు. కానీ భవిష్యత్తు ఈ దశలతో ఆగిపోదు. సాంకేతికత ఒక ప్రవాహంలా నిరంతరం ముందుకు కదులుతోంది. ఈ ప్రయాణంలో కొత్త దిశలు మనల్ని ఎదురు చూస్తున్నాయి.

## డిజిటల్ యుగం లోతులు

ప్రస్తుతం మనం ఇంటర్నెట్ ఆధారిత సంభాషణా ప్రపంచంలో ఉన్నాం. ఈ ప్రపంచం కేవలం మాటలకే పరిమితం కాకుండా, చిత్రాలు, వీడియోలు, శబ్ద తరంగాలు, ప్రత్యక్ష ప్రసారాలు అన్నీ ఒకే చోట కలిసిపోయే విధంగా ఉంది. ఒకరికొకరు కలవకపోయినా, ఒకే గదిలో కూర్చున్నట్లుగా అనిపించే వాతావరణం ఏర్పడుతోంది. వర్చువల్ మీటింగ్స్, ఆన్‌లైన్ క్లాసులు, డిజిటల్ కాన్ఫరెన్సులు ఇవన్నీ ఆ అభివృద్ధికి ఉదాహరణలు.

## వర్చువల్ వాస్తవికత

సాంకేతికత మరో మెట్టెక్కుతున్నది. వీఆర్ పద్ధతుల ద్వారా మనిషి వాస్తవికతను మించిన అనుభూతులను పొందుతున్నాడు. ఎవరితోనైనా మాట్లాడేటప్పుడు కేవలం వారి ముఖం మాత్రమే కాదు, వారు కూర్చున్న ప్రదేశం, వాతావరణం కూడా వర్చువల్‌గా మన ముందుకు వస్తోంది. భవిష్యత్తులో లేఖలు, వీడియో కాల్స్ కంటే ముందుకు వెళ్లి, ఒక గదిలో కూర్చొని మాట్లాడుతున్నట్టుగా అనిపించే అనుభవం సాధారణమవుతుంది.

## కృత్రిమ మేధస్సు పరిణామం

ఏఐ ఇప్పుడు కేవలం సందేశాలను రాసి పంపే స్థాయిలో ఆగిపోలేదు. ఇది మన భావోద్వేగాలను అర్థం చేసుకుని, సరైన సమయంలో సరైన రీతిలో ప్రత్యుత్తరాలు ఇవ్వగలుగుతోంది. భవిష్యత్తులో ఏఐ మన స్వరం, మన మాట తీరు, మన హృదయ స్పందనల్ని కూడా అనుకరిస్తుంది. మనమే మాట్లాడకపోయినా, ఏఐ మన తరపున ఒక ప్రత్యేకమైన శైలిలో సంభాషణ జరపగలదు. ఇది కొత్త యుగానికి సంకేతం.

## హోలోగ్రామ్ సంభాషణలు

మరికొన్ని దశాబ్దాల్లో హోలోగ్రామ్ సాంకేతికత విస్తృతమవుతుంది. కేవలం స్క్రీన్‌లో కనిపించే చిత్రమే



కాకుండా, మనిషి యొక్క ప్రతిరూపం గదిలో నిలబడి మాట్లాడినట్టుగా అనిపించే వాతావరణం ఏర్పడుతుంది. ఒక తండ్రి విదేశాల్లో ఉన్నా, హోలోగ్రామ్ రూపంలో ఇంట్లో కూర్చున్న పిల్లలతో సంభాషించగలడు. ఇది కేవలం కల్పన కాదు, భవిష్యత్తులో తప్పక నిజమయ్యే మార్పు.

## మనసు-మనసు సంభాషణలు

శాస్త్రవేత్తలు పరిశోధిస్తున్న మరో కొత్త రంగం "బ్రెయిన్ టు బ్రెయిన్ కమ్యూనికేషన్." అంటే, మనసులో వచ్చిన ఆలోచనలు నేరుగా మరొకరి మేధస్సులోకి ప్రవహించే విధానం. మాటలకీ, అక్షరాలకీ అవసరం లేకుండా, ఆలోచనలే సందేశాలుగా మారిపోతాయి. ఇది జరిగితే, లేఖల నుండి వీడియో కాల్స్ వరకు వచ్చిన పరిణామం మరో అద్భుత దిశగా వెళ్తుంది.

## సమాజంపై ప్రభావం

ఈ మార్పులు కేవలం సాంకేతిక దశలుగానే కాదు, మనిషి జీవన విధానంపైనా ప్రభావం చూపుతున్నాయి. పూర్వం లేఖ రాయడానికి రోజులు పట్టినా, ఆ లేఖలోని భావం చిరకాలం నిలిచి ఉండేది. ఇప్పుడు సందేశం సెకన్లలో చేరుతున్నా, ఆ భావానికి నిలకడ తగ్గిపోతున్నది. భవిష్యత్తులో ఈ రెండు మధ్య సమతౌల్యం అవసరం. వేగం మాత్రమే కాదు, భావాల లోతు కూడా నిలవాలి.

## ఊహించని మార్పులు

ఇంకా జరగబోయే మార్పులను పూర్తిగా ఊహించడం మనకు సాధ్యం కాదు. సాంకేతికత మన ఊహలను మించి పరిగెడుతోంది. నేడు ఏఐ అని పిలుస్తున్నది రేపు మరొక కొత్త రూపంలో మన ముందుకొస్తుంది.

నేటి తరానికి అద్భుతంగా అనిపిస్తున్న వీడియో కాలింగ్, రేపటి తరానికి ఒక సాధారణ విషయమే అవుతుంది.

## ముగింపు దిశలు

ఈ మార్పులన్నీ మనిషి సంభాషణా తపనకు ప్రతీకలు. భావాలను మరొకరికి పంచుకోవడం, దూరాన్ని తగ్గించడం, సమయాన్ని ఆదా చేయడం.. ఇవన్నీ ఒకటే లక్ష్యం. పావురం నుండి హోలోగ్రామ్ వరకు సాగిన ఈ ప్రయాణం, మనిషి చరిత్రలో ఒక అద్భుత గాథ. భవిష్యత్తు ఈ గాథను మరింత సమృద్ధిగా మలుస్తుంది.

**- డా. చిటికెన కిరణ్ కుమార్**

కథ

# చిగురించిన ఆశ

ఒకసారి చిలకమ్మ బాగా పండిన జామపండును నోటి కరుచుకుని తన పిల్లలకు ఆకాశంలో ఎగురుతూ పట్టుకువెళుతోంది.

ఆ జామ పండులోని ఓ విత్తనం జారి బాట పక్క పడింది. ఒకటి రెండు రోజుల్లో ఆ విత్తనం పైకి మట్టి చేరి భూమి లోపలికి చేరింది.

భూమిలోకి చేరిన ఆ విత్తనం మొలకయి, పిలకై, మొక్కయి, చెట్టు కావాలని ఆశ పడింది.

ఇది గమనించిన మట్టిపెళ్ళ "నీకు అంత అదృష్టం లేదు. నీవు కుళ్లిపోయి ఈ భూమిలోనే కలిసిపోతావు" అని అంది.

ఆ మాటలకు విత్తనానికి పౌరుషం వచ్చింది. "దేవుడి దయ వలన గుక్కెడు నీళ్ల నా మీద పడితే నేను పులకించిపోయి పచ్చని చిగురావుతాను. అయినా ఉదయిస్తున్న సూర్యుణ్ణి, పుట్టబోయే బిడ్డను, నాలాంటి పచ్చని మొలకను ప్రపంచాన్ని చూడకుండా ఆపడం నీ తరం, నీ తాత తరం కూడా కాదు.." అని గట్టిగా అంది విత్తనం మట్టిపెళ్ళతో.



రెండూ ఢీ అంటే ఢీ అనుకున్నాయి.

ఆ తరువాత కొన్ని రోజులకు ఒక రైతు కావిడితో పొలానికి నీళ్ల తీసుకు వెళుతుండగా కొన్ని చుక్కలు ఆ విత్తనం ఉన్న చోట పడ్డాయి. మరుసటి ఉదయానికి విత్తనం మట్టిపెళ్లను చీల్చుకుంటూ మొలకెత్తింది.

జామమొలక వచ్చిన చోట రూపాయంత మట్టిపెళ్ళ పైకి లేచింది. అలా చూస్తుండగానే ఆ మొలక మొక్కయి, చెట్టయింది. కాలక్రమంలో రైతులకు నీడయింది. రామచిలుకులకు తియతియ్యని పండ్లు ఇచ్చే అమ్మయింది.

**మంచి మాట**

- ఆశ పడటం మనిషి నైజం. అత్యాశ మనిషి పతనం.
- నిజాయితీగా ఉండటం ఒక కళ, ఈ కళ అందరికీ అబ్బదు.

**- రాళ్లబండి గీతామృత,**
జరజాపుపేట







## బాలగేయం

### సృజన ఎరువులు

కలము చేతబట్టి
కవితలే రాయగా

తెలిసే వచ్చునెన్నొ
అక్షర సమూహాలు.

వినడం అనడం
చూడటం చెప్పడం
చదవడం రాయడం
సృజనలకే ఎరువులు
ఉన్నవారే పంచగలరు.

జ్ఞానాన్ని పదుగురికి
విజ్ఞానం వికసించగా
బాలకవులుగా ఎదిగేరు.

–పెందోట వెంకటేశ్వర్లు
సిద్దిపేట



**చిన్నారుల ప్రశ్నలకు**
**వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్**
**గిరీష్ అంకుల్ సమాధానాలు**

కె.వాణి, తుని

ప్రశ్న: ప్రొటీన్‌లంటే ఏమిటి?అవేం చేస్తాయి?

**జవాబు:** శరీరంలో సహజసిద్ధంగా ఉండే రసాయనాల సమ్మేళనాలే ప్రొటీన్‌లు. అమినో యాసిడ్‌లతో ఇవి ఏర్పడతాయి. కణచర్యలన్నింటినీ నడిపేది ప్రొటీన్‌లే. ఈ క్రమంలో జీవి లక్షణాలను కూడా ప్రభావితం చేస్తాయి. ఉదాహరణకు 'మెలనిన్' ప్రొటీన్ మీద కళ్లు, జుట్టురంగును నిర్ణయించుకుంటుంది. 'మైయోసిన్ కారణంగా కండరాలు కదులుతాయి. కణాంతర్భాగంలో, కణాల మధ్య సమాచార వినిమయానికి ప్రొటీన్ తోడ్పడుతుంది.

ఎస్.కరుణాకర్, గుంటూరు

ప్రశ్న: కీటకాలకు చెవులుంటాయా?

**జవాబు:** మనుషులకు వున్నట్లు క్రిమికీటకాలకు చెవులుండవు. అయినా అవి ధ్వనిని గ్రహిస్తాయి. మన చెవిలో వినికిడి అవసరమైన ఇయర్ డ్రమ్ వున్న తరహాలోనే వాటి శరీరంలో టింఫానిక్ లేయర్(వినికిడిశక్తిగల పొర) ఉంటుందని శాస్త్రవేత్తలు తెలిపారు. ఈ టింఫానిక్ లేయర్ కొన్ని కీటకాల్లో బాహ్య అస్థిపంజరంలో ఉంటుంది. మరికొన్నింటిలో ముందు కాళ్లల్లోగానీ, ఉదరం కిందకుగానీ ఉంటుంది. కొన్ని కీటకాలలో అయితే ప్రత్యేకంగా వాటి చర్మం మీద వున్న వెంట్రుకలే శబ్దాలను వినగలవు. సహజంగా కీటకాలు తమ తోటి కీటకాలను కలుసుకోవడానికి శబ్దాలను చేయడం అలవరచుకుంటాయి. కొన్ని కీటకాలయితే తమను తాము రక్షించుకోవడానికి శబ్దాలను ఉపయోగించుకుంటాయి.

ఉదా: గబ్బిలాలు ఎగురుకుంటూ ఆహారాన్ని అన్వేషించే సందర్భంలో వెలువడే శబ్దాలను గ్రహించిన కొన్ని రకాల కీటకాలు, పురుగులు తమను తాము కాపాడుకుంటాయి.





# కరక్కాయతో బహుళ ప్రయోజనాలు

ఆరోగ్య సమస్యలన్నింటికీ ఆయుర్వేదంలో పరిష్కారాలు ఉన్నాయి. అలోపతి వచ్చిన తరవాత అంతా ఈ అలోపతి మెడిసిన్‌కి అలవాటు పడిపోయారు. ఆయుర్వేదంలో ఎంతో సహజసిద్ధమైన చికిత్సలున్నాయి. కాస్త అవగాహన పెంచుకుంటే సులభంగా అనారోగ్యాల నుంచి బయటపడొచ్చు. ఈ వైద్య విధానంలో చెప్పినవి ఏవైనా అందరికీ అందుబాటులో ఉండేవే.

పసుపు, అల్లం, తేనె.. ఇలా ఇంట్లో రోజూ వాడుకునే పదార్థాలతోనే అద్భుతమైన వైద్యం చేయొచ్చని చెబుతోంది ఆయుర్వేదం.

ఈ వైద్యశాస్త్రంలో కరక్కాయకీ ఎంతో ప్రాధాన్యత ఉంది. ఇందులోని యాంటీ ఆక్సిడెంట్ గుణాలు శరీరాన్ని చల్లబరచడంతో పాటు కఫం లాంటి సమస్యల్నీ దూరం చేస్తాయి. అందుకే కాస్తంత దగ్గు రాగానే ఇంట్లో పెద్దవాళ్లు కరక్కాయను బుగ్గన పెట్టుకుని ఆ

రసాన్ని మింగాలని సలహా ఇస్తారు. అనేక రోగాలకు దివ్యౌషధాలు మన వంటింట్లోని పోపుల పెట్టెలోనే ఉంటాయి. వాటిలో ముఖ్యమైనది కరక్కాయ.

కరక్కాయను సంస్కృతంలో హరిటకి అంటారు. ఇదొక్కటే కాదు. అజీర్తి, కడుపు ఉబ్బరం లాంటి సమస్యలకీ ఇది మంచి ఔషధంగా పని చేస్తుంది. కరక్కాయను ఎప్పుడు తీసుకున్నా ఆరోగ్యానికి మంచిదే అయినా పరిగడుపున తీసుకుంటే ఆ ప్రయోజనాలు రెట్టింపు అవుతాయని ఆయుర్వేదం చెబుతోంది.

## విశేషస్థానం

ఆయుర్వేద శాస్త్రంలో కర్కక్కాయకు విశేష స్థానం ఉన్నది. ఎన్నో గుణగణాలు కలిగినది కరక్కాయలో చలవ చేసే గుణం ఉంది. ఇది పైత్యాన్ని హరిస్తుంది. దగ్గుతో బాధపడేవారు చిన్న కరక్కాయ ముక్కను బుగ్గన ఉంచుకుంటే చాలు ఉపశమనం

కలుగుతుంది.

కరక్కాయలో యాంటీ ఇన్‌ఫ్లామేటరీ గుణాలు ఉంటాయి. అందువల్ల దీన్ని తీసుకుంటే శరీరంలోని వాపులు తగ్గిపోతాయి. ముఖ్యంగా ఆర్థరైటిస్ లేదా గౌట్ ఉన్నవారికి కరక్కాయ ఎంతగానో మేలు చేస్తుంది. ఆయా వ్యాధుల నుంచి బయట పడవచ్చు. కరక్కాయ మన శ్వాసకోశ వ్యవస్థకు కూడా ఎంతో మేలు చేస్తుంది. ఇది దగ్గు, ఆస్తమా, బ్రాంకైటిస్ వంటి సమస్యలను తగ్గిస్తుంది. వాపుల నుంచి ఉపశమనాన్ని అందిస్తుంది. దీంతో ముక్కుదిబ్బడ కూడా తొలగిపోతుంది. కరక్కాయ మన హృదయ సంబంధ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. ఇది కొలెస్ట్రాల్ లెవల్స్‌ను తగ్గిస్తుంది. దీంతో శరీరంలో రక్త సరఫరా మెరుగు పడుతుంది. గుండె కండరాలు బలంగా మారుతాయి. దీని వల్ల గుండె జబ్బులు వచ్చే అవకాశాలు తగ్గుతాయి.



## బరువు తగ్గిస్తుంది

బరువు తగ్గాలని ప్రయత్నాలు చేసిన వాళ్లు కరక్కాయనీ ట్రై చేయండి. చాలా తొందరగా ఫలితాలు కనిపిస్తాయి. పరిగడుపునే కరక్కాయను తీసుకోవడం వల్ల శరీరంలో కొవ్వు కరిగిపోతుంది. వేగంగా బరువు తగ్గిపోతారు. మెటబాలిజం కూడా సరైపోతుంది. అంతేకాదు... అనారోగ్యకరమైన ఆకలిని తగ్గించి ఆరోగ్యకరమైన ఆకలిని పెంచుతుంది. ఇందులోని యాంటీ ఆక్సిడెంట్ గుణాలు శరీరంలోని మలినాలను తొలగిస్తాయి. కరక్కాయ లివర్ ఆరోగ్యాన్ని కూడా మెరుగు పరుస్తుంది. లివర్ శుభ్రంగా మారేలా చేస్తుంది. దీన్ని తింటుంటే లివర్‌లోని టాక్సిన్లు బయటకు పోతాయి. ఫ్రీ ర్యాడికల్స్, టాక్సిన్ల వల్ల లివర్‌కు కలిగే నష్టం నివారించబడుతుంది. అలాగే చర్మాన్ని సంరక్షించే గుణాలు కూడా కరక్కాయలో ఉంటాయి.



## చర్మ సమస్యలను తగ్గిస్తుంది..

మొటిమలు, గజ్జి, తామర, సోరియాసిస్ వంటి చర్మ సమస్యలను కరక్కాయ తగ్గిస్తుంది. కరక్కాయలో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి ఫ్రీ ర్యాడికల్స్‌ను నిర్మూలిస్తాయి. దీంతో ఆక్సీకరణ ఒత్తిడి తగ్గుతుంది. దీని వల్ల వృద్ధాప్య ఛాయలు తగ్గుతాయి. చర్మంపై ఉండే ముడతలు, మచ్చలు పోతాయి. ముఖం కాంతివంతంగా మారి యవ్వనంగా కనిపిస్తుంది. ఇలా కరక్కాయతో మనం అనేక ప్రయోజనాలను పొందవచ్చు. దీన్ని పొడిగా చేసి కూడా ఉపయోగించవచ్చు. లేదా చిన్న ముక్కను నోట్లో వేసుకునిచప్పరిస్తూ రసం మింగవచ్చు. ఇలా కరక్కాయను తీసుకుంటే పైన తెలిపిన ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు.

చాలా మందికి అజీర్తి సమస్య చాలా కామన్ అయిపోయింది. ఏం తిన్నా కడుపు ఉబ్బరంగా అనిపిస్తుంది. తేన్పులు వస్తాయి. ఏమాత్రం ఆకలి అనిపించదు. ఎప్పుడైనా ఆయిల్ ఫుడ్ తింటే ఆ రోజంతా ఇబ్బంది పడుతూనే ఉంటారు. ఈ సమస్య తగ్గించుకునేందుకు రకరకాల మందులు వాడుతుంటారు. కరక్కాయను పరిగడుపున తీసుకోవడం వల్ల ఈ అజీర్తి తగ్గిపోతుంది.

పొట్టలో డైజెస్టివ్ ఎంజైమ్స్‌ని విడుదల చేస్తుంది. శరీరానికి సరైన విధంగా పోషకాలు అందేలా చేస్తుంది. పరిగడుపున ఓ చిన్న కరక్కాయ ముక్కను నోట్లో వేసుకుంటే జీర్ణ వ్యవస్థ మెరుగవుతుంది.

ఏ జబ్బులూ రాకుండా ఉండాలంటే మనలో ఇమ్యూనిటీ ఉండాలి. మరి ఆ ఇమ్యూనిటీని పెంచే ఆహారాన్ని తీసుకుంటున్నామా అన్నదే ముఖ్యం. ఇప్పుడు అంతా జంక్ ఫుడ్ కి అలవాటు పడిపోతున్నారు. దీని వల్ల కడుపు నిండుతుందే తప్ప ఎలాంటి ప్రయోజనం ఉండదు. పైగా ఎన్నో రోగాలకు ఇవే కారణం కూడా.



ఇప్పటికైనా ఈ అనారోగ్యకరమైన ఆహారాన్ని ఆపేసి ఆరోగ్యంగా ఉండాలంటే కరక్కాయను తినడం మంచి ఆప్షన్. ఇది రోగనిరోధక శక్తిని పెంచుతుంది.

ఆయుర్వేదంలో త్రిఫలాలకు ఎంతో ప్రాధాన్యత ఉంటుందన్న సంగతి తెలిసిందే. త్రిఫలాలు అంటే.. కరక్కాయ, తానికాయ, ఉసిరికాయలను త్రిఫలాలుగా పిలుస్తారు. ఈ మూడింటినీ సమ పాళ్లల్లో కలిపి తయారు చేసిన త్రిఫల చూర్ణాన్ని ఔషధంగా ఉపయోగిస్తుంటారు. అయితే త్రిఫలాల్లో ఒకటైన కరక్కాయను నేరుగా తీసుకోవచ్చు. దీన్ని త్రిఫల చూర్ణంలో భాగం చేయాల్సిన పనిలేదు. కరక్కాయను పొడి చేసి నేరుగా తీసుకుంటే అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి. పలు రకాల వ్యాధులను తగ్గించేందుకు కరక్కాయ ఎంతగానో పనిచేస్తుంది.

కరక్కాయ పెంకులు(బెరడు), వస ఆకులు కలిపి రెండు రోజులు నానబెట్టాలి. తర్వాత వీటిని ఎండబెట్టి పొడిచేసి పూటకు అర టీస్పూన్ చొప్పున నేరుగా లేదా తేనెతో కలిపి తీసుకుంటే అవయవాల్లో అంతర్గత రక్తస్రావం ఆగుతుంది. కరక్కాయ, శొంఠి, తానికాయ, పిప్పళ్లు చూర్ణాలను సమానంగా కలిపి నిల్వచేసి, అర టీస్పూన్ చొప్పున రోజుకు మూడుసార్లు తేనె లేదా నీటిలో కలిపి తీసుకుంటే దగ్గుతో పాటు ఆయాసం కూడా తగ్గుతుంది. ఎక్కిళ్లు ఇబ్బంది పెడుతున్నప్పుడు అరచెంచాడు కరక్కాయ చూర్ణాన్ని వేడినీళ్లతో గాని లేదా తేనె, నెయ్యి మిశ్రమంతోగాని కలిపి తీసుకుంటే ఫలితం ఉంటుంది.

**– ఆనంద 'మైత్రేయ' మ్**

– వ్యసనానికి బానిసైతే దానికి పర్యవసానం ప్రాణంమీదకు తెస్తుంది, ప్రాణమే తీస్తుంది. కనుక వ్యాసనాలకు దూరంగా ఉండటం శ్రేయస్కరం.

– మనకి నచ్చినట్టు మనం బతకాలంటే ఏకాంతంతో జతకట్టాలి. నాయకత్వ లక్షణాలుంటే మానవత్వం అనే బడిలో నిరంతరం శిక్షణ తీసుకోవాలి.

కథ

# బహుమతి

రాజు యెదుగిరి


**ఇంకో రెండు రోజుల్లో రాజీ బర్త్‌డే. పెళ్లైన తరువాత తను మా ఇంట్లో జరుపుకుంటున్న మొదటి పుట్టినరోజు ఇది.**

**రాజీ పల్లెటూరి అమ్మాయి. ఆమెకు ఈ గిఫ్టులు, చాక్లెట్లు అంతగా ఇష్టం ఉండవు. స్మార్ట్ ఫోన్లు, గాడ్జెట్లు వాడడం కూడా చాలా తక్కువ. టెక్నాలజీ గురించి పెద్దగా తెలియదు కూడా.**

ఒకసారి "బయట తినే తిండి నాకు అంతగా ఇష్టం ఉండదు" అని పెళ్లయిన కొత్తలో చెప్పిన మాటలు నాకు గుర్తొచ్చాయి. అప్పట్నించి రెస్టారెంట్ వగైరాలోకి తీసుకెళ్ళాలని కూడా అనుకోలేదు. ఒకవేళ తీసుకువెళ్లిన కూడా అంత ఆసక్తి చూపించదు. పనులన్నీ పూర్తి చేసి నన్ను ఆఫీసుకి పంపించి, ఇంటి పనుల్లో కలుపుగోలుగా ఉండే అమాయకమైన అమ్మాయి రాజీ ఇలాంటి అమ్మాయికి నేనేమి బహుమతి ఇవ్వాలి?

"ఈ ఆలోచనతోనే ఆఫీసుకు బయలుదేరాను. ఆఫీస్‌కు వెళ్లాక పనుల్లో మునిగిపోయినా, నా ధ్యాస అంతా రాజీ బహుమతి పైనే ఆ గిఫ్ట్ విషయంలో మనసులో ఓ మినీ యుద్ధం జరుగుతోంది. సాయంత్రం ఐదు గంటలకల్లా పని ముగించి ఇంటివైపు బయలుదేరాను. ట్రాఫిక్ సిగ్నల్లో బైక్ ఆపి చుట్టూ చూశాను. అప్పుడు ఒక ముప్పై ముప్పై ఐదేళ్ళ మహిళ, చంకన ఇద్దరు పసిపిల్లలతో ముందుకొచ్చింది. "అన్నా, అన్నం తిని రెండు రోజులు అయ్యింది. పిల్లలకైనా కనీసం ఒక పది రూపాయలు ఇవ్వండి..." అని రెండు చేతులు జోడించి వేడుకుంది.

చాలా సార్లు ఇలా నటించే వాళ్లు ఉంటారు అనుకున్నాను. కానీ ఈసారి ఆమె కళ్ళలోని బాధ నన్ను తాకింది. ఆమె ముఖంలో నిజమైన వేదన కనిపించింది. గుండె పిండేసింది. పై జేబులో ఉన్న వంద రూపాయల నోటును తీసి ఆమెకు ఇచ్చి అక్కడి నుంచి వెళ్లిపోయాను.



ఉదయం ఆరు గంటలయ్యింది. రాజీ బ్లాంకెట్ తీయగానే "హ్యాపీ బర్త్ డే రాజీ... హ్యాపీ బర్త్ డే" అంటూ నుదిటిపై ముద్దుపెట్టి హత్తుకున్నాను.

"థ్యాంక్స్ అండి..." అంటూ తడబడే చిరునవ్వుతో చెప్పింది రాజీ.

స్నానం చేసి దగ్గరలో ఉన్న గుడికి బయలుదేరాం. గుడిలోపలికి వెళ్తూ మెట్లపై చిన్నపిల్లలు, ముసలివాళ్లు, వికలాంగులు ఆకలితో కూర్చుని ఉన్నారు.

రాజీ తన పర్సు లోంచి వంద రూపాయల నోట్లు నాలుగు తీసి వారికిచ్చింది.

"అలా అడిగినవాళ్లందరికి డబ్బులిచ్చేస్తున్నావేంటి?" అని నేనడిగాను.

"డబ్బులు దాచుకుని ఏవేవో వస్తువులకు ఖర్చు పెడితే ఏం వస్తుంది? ఇలా ఎవరికైనా ఆకలి తీరితే అదే పెద్ద ఆనందం!" అని ఆమె చెప్పింది.

ఆ మాటలు విని చిన్నగా నవ్వాను. దర్శనం ముగించుకొని ఇంటికి బయలుదేరాం.

ఉదయం తొమ్మిది గంటలు. గోడ గడియారం చప్పుడు చేసింది.

"రాజీ, పద!" అన్నాను.

"ఏంటండీ? ఇప్పుడు బయటికెందుకు? పాయసం చేసి తెస్తాను" అంటూ లోపలికి వెళ్లబోయింది రాజీ.

"నువ్వు పాయసం చేసినా, మనం బయటకి వెళ్లాల్సిందే!" అన్నాను.

"ఇంతకీ ఎటు?" ఆశ్చర్యంగా అడిగింది రాజీ.

"చెబుతాను, ముందు పద!" అని ఇద్దరం ఇంటి నుంచి బయలుదేరాం. బైక్ నేరుగా ఒక చిన్న ఇంటి ముందు ఆపాను.

"నన్ను ఇక్కడికి ఎందుకు తీసుకొచ్చారండీ? ఇంతకు ముందెప్పుడూ మనం రాలేదుగా?" అంది రాజీ.

"పద, చెప్తాను" అని లోపలికి తీసుకెళ్లాను.

లోపలికి వెళ్ళగానే పది పన్నెండు మంది చిన్నపిల్లలు ఒక్కసారిగా "హ్యాపీ బర్త్ డే రాజీ అక్కా!" అని గట్టిగా అరవడం మొదలుపెట్టారు.

రాజీ ముఖంలో ఆనందం ఆకాశాన్ని తాకింది. పిల్లల దగ్గరికి వెళ్లి వారిని హత్తుకుంది. "థ్యాంక్యూ... థ్యాంక్యూ!" అంటూ ఆనంద భాష్పాలు కళ్లలో మెరిశాయి.

"అంతా రెడీనా మేడం?" అని నేను అడిగాను.

"అంతా రెడీ అండి" అని అక్కడ పనిచేస్తున్న యువతి నవ్వుతూ చెప్పింది.

పిల్లలందరినీ వరుసగా కూర్చోబెట్టాం. "పద రాజీ... వడ్డిద్దాం" అని అన్నాను. ఇద్దరం కలిసి పిల్లలందరికి బిర్యానీ, పళ్ళు, స్వీట్లు వడ్డించాం.

రాజీ చిన్నప్పుడు తల్లిదండ్రులను ఒక రోడ్డు ప్రమాదంలో కోల్పోయింది. ఏడేళ్ల పసితనంలోనే ఆమెకి అనాథత్వం తెలిసింది. ఒక బంధువులింట్లో రెండు సంవత్సరాలు ఉండగలిగింది. కానీ వారి చూపులో ప్రేమ కన్నా బాధ్యత భారంగా మారిపోయిన మాటలు ఎక్కువయ్యాయి.

"ఎవరు తల్లిదండ్రుల పేరుతో ఇంట్లో పెంచుకోవాలి?"

"ఇంట్లో ఉన్న పిల్లల భవిష్యత్తు నాశనం అవుతుంది." ఇలా సూటి పోటీ మాటలు ఎన్నో. ఆ మాటలు రోజురోజుకి గుచ్చుకున్నాయి.

ఆమెను ఒక అనాథాశ్రమంలో దించేసిన రోజు రాజీ జీవితం మారిపోయింది. గుండె లోతుల్లో ఎదురు చూసే వెచ్చటి ఆలనాపాలన లేవు. కానీ ఆ చిన్న వయసులోనే ఆమెకి తెలిసింది ఇంట్లో ఉంటేనే కాదు, గుండెల్లో చోటు దక్కించుకోవడమే నిజమైన ఇంటి మనిషి అవడం అనాథాశ్రమంలో బడికి వెళ్లడం, ఆ వయసులోనే చిన్నపాటి పనులు చేయడం ఆమెకి అలవాటయ్యాయి. చిన్నపిల్లలైనా, పెద్దవాళ్ళైనా... ఎవరి బాధ చూసినా తట్టుకోలేని హృదయం తనది. ఆమె ఆశ్రమంలో వున్న చిన్న పిల్లలతో మమేకమవుతూ వారితో ఆడుతూ, పాడుతూ, నవ్విస్తూ వారికి ఒక అక్కలా మారిపోయింది.

**"ఇక్కడికి ఎందుకు తీసుకొచ్చారండీ? ఇంతకు ముందెప్పుడూ రాలేదుగా?" అంది రాజీ. "పద, చెప్తాను" అని లోపలికి తీసుకెళ్లాను.**



అందుకే ఈ రోజుకీ చిన్నపిల్లల్ని చూసినప్పుడల్లా ఆమె హృదయం తడవుతుంది. అవకాశం రాగానే ఒ ఉద్యోగం చేసి, స్వయం సంపాదనతో జీవించాలనుకుంది. అప్పుడే నేను కలిసింది ఆమెను.

మొదట పాపాన్సులా అనిపించిన ఈ పరిచయం, ఆప్యాయతగా మారి, ప్రేమగా వికసించింది. ఆమెను జీవిత భాగస్వామిగా చేసుకోవాలని నిశ్చయించుకున్నాను. నా ప్రేమ విషయం ఆమెకి చెప్పాను.

రాజీ ఒప్పుకుంది. ఇద్దరం కలిసి పెళ్లి చేసుకున్నాం.

"రాజీ... నీకు ఏం బహుమతి ఇవ్వాలో నాకు అర్థం కాలేదు ఇంతవరకు ఎప్పుడూ ఇవ్వని బహుమతి ఇవ్వాలనిపించింది. డబ్బులు వృథాగా ఖర్చు చేయడం కంటే నలుగురి ఆకలి తీర్చడం మంచిదని నీ దగ్గరి నుంచే నేర్చుకున్నాను. పెళ్లయ్యాక నాతో కలిసి చేసుకుంటున్న నీ తొలి పుట్టినరోజు ఇది. నీకు జీవితాంతం గుర్తుండిపోయేలా ఉండాలని అనిపించింది. అందుకే ఇలా ఏర్పాటు చేసాను. నా బహుమతి నీకు నచ్చిందనుకుంటాను" అన్నాను.

రాజీ ఏం మాట్లాడలేకపోయింది. కన్నీళ్లతో నన్ను హత్తుకుంది.

## వింత కొలను

గోవా రాష్ట్రంలోని నేత్రాలి పట్టణానికి సమీపంలో ఉన్న ఆలయాన్ని గోపీనాథ్ ఆలయం అంటారు. ఈ ఆలయం వెనక వైపు ఒక కొలను ఉంది. కోనేటిలోని నీళ్ల స్వచ్ఛంగా ఉంటాయి. నేల అడుగు సైతం కనిపించేంత స్వచ్ఛంగా ఉంటాయన్నమాట. ఇవన్నీ మామూలు విషయాలే అయినా అసలు సంగతేమిటంటే– అక్కడి మెట్ల పైన కూర్చుని చప్పట్లు కొట్టినా, నిలబడి గట్టిగా మాట్లాడినా ఆ శబ్దాన్ని బట్టి కొలనులోని నీటిలో బుడగలొస్తాయి. అందుకే దీనికి బుద్బుద తాలి అని పేరు వచ్చింది. అక్కడి సల్ఫర్ ఆక్సైడ్ వల్ల నీటిబుడగలు వస్తున్నాయని శాస్త్రవేత్తల అభిప్రాయం.



పుస్తక సమీక్ష

## గొప్ప అనువాద నవల

నవలలు, కథా సంపుటాలు, కవిత్వం వెలయిస్తూ తెలుగు సాహిత్యంలో తనకంటూ ఓ ప్రత్యేక స్థానం నిలబెట్టుకున్న స్వాతీశ్రీపాద గారికి మరో ప్రత్యేకత ఆపాదించవచ్చు. ఇతర భాషల నుండి తెలుగుకు, తెలుగు నుండి ఇతర భాషలకు అనువాదం చేస్తారు. అనువాద ప్రక్రియను 'అసిధారా వ్రతం'గా చెప్పవచ్చు. అనువాదం చేయబడే పరాయి భాష మీద రచయితకు మంచి పట్టు ఉండాలి. ఒక భాషా సాహిత్యంలో అనువాద రచనలు 'తెరచిన కిటికీలు' లాంటివిగా చెప్పవచ్చు. పరాయి భాష భావ సంస్కృతులు స్వేచ్ఛగా ప్రవహిస్తూ, సాహిత్య వికాసానికి అనువాదం రచనలు బాగా తోడ్పడుతాయి.

స్త్రీ అంతరంగాన్ని ఆవిష్కరించిన 'అంతర' కన్నడంలో డా॥ మవినాకులి జయప్రకాశ్ రాయగా, స్వాతీశ్రీపాద తెలుగులోకి అనువదించారు. స్త్రీ హృదయం ఒక సెల్యులాయిడ్ ఫోటో వంటిది. ఒకసారి ఒక రూపం/ముద్ర పడితే అది జీవితాంతమూ చెరిగిపోదు. ప్రేమ సఫలమైతే ఫరవాలేదు కానీ విఫలమైతే ఆ స్త్రీనతన జీవితాంతమూ వేధిస్తూనే ఉంటాయి ఆ జ్ఞాపకాలు అగ్నిపర్వతపు 'లావా'లా. ఆ స్త్రీ అంతర్యం సెగలు గక్కుతూనే ఉంటుంది. సువర్ణ అనే కాలేజీ యువతి సహధ్యాయి ప్రభాకర్‌ను ప్రేమిస్తుంది. విఫలమైన ఆ ప్రేమను మరిచిపోవటం ఎంత కష్టమో 'అంతర' వివరిస్తుంది. ఆద్యంతమూ సువర్ణ సున్నితమైన ఆలోచనలు, అలజడి, సంఘర్షణలను అతి ప్రతిభావం తంగా అనువదించారు రచయిత.

**(అంతర(అనువాదం నవల)కన్నడ మూలం: మవినాకులి జయప్రకాశ్, తెలుగు అనువాదం: స్వాతీశ్రీపాద; వెల: రూ.100/-లు; ప్రతులకు: ప్రముఖ పుస్తక కేంద్రాలు)**

**– కూర చిదంబరం**

## ఆసక్తికరంగా చదివించే నవల



వీర పూర్ణచందర్‌రావు, ప్రస్తుత సమాజాన్ని పీడిస్తున్న మాదక ద్రవ్యాలపై 'బంగారుతీగ' పేరిట రచించిన నవల ఆద్యంతం ఆసక్తికరంగా చదివింపచేస్తుంది. మన దేశానికి ఉత్తరాన ఉన్న గంగా సరోవరం పైన హిమగిరి కింద యూకలిప్టస్ అటవీ ప్రాంతంలో భారత్ సైనికులు 'సైలెంట్ స్ట్రైక్ ఆపరేషన్'లో బంగారుతీగ మాదక ద్రవ్య పంటను కూకటివేళ్లతో పెకిలించి, డ్రగ్స్ దందా కీలకనేతలను అరెస్ట్ చేయటం పతాక సన్నివేశంగా నవల ముందుకు సాగుతుంది. ధీమంత్, వెరోనికాల ప్రేమపెళ్లి నిర్ణయంతో ప్రారంభమైన నవల చకచకా పరిశోధనా కథనంగా, డ్రగ్ మాఫియా నేరస్థుల ఆట కట్టించడంలో సైన్యం, పోలీస్ యంత్రాంగం పాత్ర రచయిత ప్రశంసనీయంగా నడిపించారు. మాదక ద్రవ్యాలకు అలవాటుపడిన నిర్భాగ్యులు దోషులు కాదని, విక్టిమ్స్ అని అటవీ ప్రాంతాలలో రహస్యంగా పంట పండించే నేరస్థుల మాఫియా ముఠాల ఘోర నేరాలను నిర్మూలించి అమాయకులు, నిస్సహాయులు అయిన బాధితులు వ్యసనపరులుగా మారకుండా వుండటానికి ప్రాణాంతక డ్రగ్స్ రాక్షసిని సంహరించాలనే సందేశం ఈ నవల అందిస్తోంది. నాలుగు దేశాల మధ్య వున్న నో మ్యాన్ లాండ్ యూకలిప్టస్ అడవిలో రాజకీయ నాయకుల ప్రోద్బలంతో, మాదకద్రవ్య పంటతో పాటు మాఫియా నేతల ఆట కట్టించడం దుష్టజన శిక్షలతో కథ ముగుస్తుంది. నిస్వార్థ అవయవ దానం మెదడు ధీమంత్‌కు అమర్చడం, వెరోనికాకు గుండెమార్పిడి శస్త్రచికిత్స రహస్య కథనాలు నవలలో రక్తి కట్టించారు. పల్లీలు అమ్ముకొనే అంధుడైన బాలునికి నేత్రదాన కంటి ఆపరేషన్‌లు కొసమెరుపులుగా నవలా రచయిత వీరపూర్ణచందర్ కల్పనా చమత్కృతి అభినందనీయం.

**(బంగారు తీగ(మాదక ద్రవ్యాలపైన నవల)– రచన: వీర పూర్ణచందర్ రావు; వెల: రూ.80/-లు; ప్రతులకు: వీర పూర్ణచందర్ రావు, నం.403, స్నోడ్రాప్ అపార్ట్‌మెంట్, ఆంజనేయ నగర్, మూసాపేట్, హైదరాబాద్-650 018)**

**– యర్రమిల్లి**

## అద్భుత బాలల కథలు



డా॥ కందేపి రాణీప్రసాద్, విద్యార్థులు సైన్సు తెలుసుకోవాలని, వారి పాఠ్యాంశాలను సులభతరంగా అందించాలని సైన్స్ కథలు బాలల కథలుగా రచించారు. బాలబాలికలకు సైన్స్ బోధించటం వల్ల శాస్త్రీయ ఆలోచనలు శాస్త్రీయ దృక్పథం పట్ల అవగాహన పెరుగుతుంది. అజ్ఞానం మూఢనమ్మకాల చట్రం నుండి బయట పడటానికి సైన్స్ దోహదపడుతుంది. ఈ పుస్తకంలోని 28 సైన్స్ కథలు డా॥ కందేపి రాణీప్రసాద్ శాస్త్రీయ పరిజ్ఞానాన్ని జీవితానికి వర్తింపచేసే ప్రతిభావంతమైన కల్పన, అధ్యయన దృష్టికి నిదర్శనంగా ఉన్నాయి. సైన్స్ టీచర్ పాత్రలో డాక్టర్ ప్రవేశించి పిల్లల భవిష్య జీవితాలను ప్రయోజనకరంగా వారి మెదళ్లలో నాటుకొనే విధంగా కథల రూపంలో చెప్పడం రచయిత్రిగా ఆమె అభినందనీయం. 'ఫస్ట్ ఎయిడ్' కథలో ఆరోగ్య శాస్త్రానికి సంబంధించిన శాస్త్రీయ వాస్తవాలు తెలియచేసారు.

**(సైన్స్ కథలు(బాలల కథలు)–రచన: డా॥ కందేపి రాణీప్రసాద్; వెల: రూ.125/-లు; ప్రతులకు: డా॥ కందేపి రాణీప్రసాద్, సృజన్ పిల్లల ఆసుపత్రి, సిరిసిల్ల-505 301, రాజన్న సిరిసిల్ల జిల్లా, తెలంగాణ; ప్రముఖ పుస్తక కేంద్రాలు)**

# ఆంగ్ల మాధ్యమం-ప్రభుత్వాల ప్రలోభం

వేగంగా అంతరించబోతున్న 200 భాషలను ఐక్యరాజ్యసమితి గుర్తించింది. అందులో తెలుగు, మరిన్ని స్థానిక భాషలు ఉన్నాయి. ప్రపంచంలో ఏ దేశంలోనూ లేని విధంగా, ఆంగ్లాన్ని, కార్పొరేట్ విద్యాసంస్థలకు అనుగుణంగా ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ప్రస్తుత పరిస్థితులలో నూతన విద్యా విధానం అమలు పేరిట కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నేరుగా ఆంగ్ల మాధ్యమం, సిబిఎస్ఇ సిలబస్‌లను ప్రవేశపెట్టింది.

నేడు మాతృభాషలు సంక్షోభంలో చిక్కుకున్న అంశం, యింకా నిర్వీర్యం చేస్తుంది. మాతృభాషల రక్షణతోనే విద్యాభివృద్ధి సాధ్యమని ప్రభుత్వం గుర్తించాలి. వివిధ కులాలు, జాతులు, ఆర్థిక తారతమ్యాలు, నిరక్షరాస్యులు, పేదలు వివిధ వెనుకబడిన ప్రాంతాలు సర్వతోముఖాభివృద్ధి సాధించే దశకు చేరాలంటే, మాతృభాషలో విద్యాబోధన మరింత అవసరం. విద్యాబోధన మాతృభాషలో సులభం, సహజం, ఖర్చు తక్కువ.



స్వేచ్ఛగా భావాలను, అభిప్రాయాలు పంచుకోవచ్చు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఎక్కువ. భాష గుత్తాధిపత్యం ఉండదు. ప్రాంతీయ ఐక్యత ద్వారా సామాజిక ఐక్యత పెంపొందించబడుతుంది. భాషా వినియోగం, వికాసం గుర్తించి రాజ్యాంగంలో 344 నుంచి 347 వరకు గల అధికరణాలు మాతృభాషల రక్షణ, వినియోగం, సామాజిక అవసరం ప్రాధాన్యత వివరించాయి. పైగా ఆంగ్ల మాధ్యమ బోధనలో స్వభావంలోనే సామాజిక విభజన ఉంది. రాష్ట్రాలలో గిరిజన, నిరుపేద వర్గాల విద్యార్థులు చదువుకు మరింత దూరం అయ్యే దుస్థితి పొంచి వుంది. మాతృభాషలో విద్యాబోధనకు ప్రాధాన్యత యిస్తేనే గిరిజన, వెనుకబడిన, నిరుపేద బాలబాలికలకు విద్యకు చేరువ కాగలుగుతారు. బడా మార్కెట్ దృష్ట్యా కార్పొరేట్ సంస్థలను బలపరిచే క్రమంలో, ప్రభుత్వాలు విద్యారంగంలో ప్రవేశపెట్టిన సంస్కరణలు మాతృభాషను కృశింపచేస్తున్నాయి.

ఆన్‌లైన్ విద్య, డిజిటల్ విద్యను పెట్టుబడిదారులకు, కార్పొరేట్ రంగాలకు అనుగుణంగా సంస్కరణలు అమలు అవుతున్నాయి. తెలుగు మాధ్యమం ప్రాథమిక పాఠశాలల స్థాయిలో కూడా లేకుండా పోయే పరిస్థితులు రెండు తెలుగు రాష్ట్రాలలో నెలకొని ఉన్నాయి. ఇంకొక ఇరవై ఏళ్ల తరువాత యువత మాతృభాష పట్ల పూర్తి సాధికారత కోల్పోయే దుస్థితి ఎదుర్కోక తప్పదు. తెలుగుభాషా చట్టం 2018 ప్రకారం తెలుగును ఒక భాషగా అయినా తప్పక నేర్చుకోవలసిన అవసరం అందరికీ ఉంది. ప్రతీ పాఠశాలలో ఏ రకమైన యాజమాన్య నిర్వహణలో ఉన్నా తెలుగును ఒక అంశంగా చదివి తీరాలి. అంతవరకే ప్రభుత్వాలు, సంస్కృతి పరిరక్షణకు యిస్తున్న ప్రాధాన్యత భాషా పరిరక్షణకు యివ్వటం లేదు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత బోనాలు, బతుకమ్మ తదితర పండుగలకు ప్రజా, ప్రభుత్వ ఆదరణ పెరిగింది. కానీ భాషకు, సంస్కృతికి ఉన్న అనుబంధం దృష్ట్యా భాషను కూడా గుర్తించి విద్యావ్యవస్థ సాహసికంగా సంస్కరించబడాలి. ఒకానొక కాలంలో ఉర్దూ రాజ్యభాషగా ఆధిపత్యం చెలాయించిన తెలంగాణాలో, అధిక శాతం తెలుగురాష్ట్రం అయినా హిందీ వ్యవహారికత కొట్టొచ్చినట్టు కనపడుతుంది.

తెలుగునాట ఏ ప్రభుత్వం భాషాభివృద్ధినీ, సాంస్కృతిక వికాసాన్ని రాష్ట్రాభివృద్ధిలో భాగంగా చూడటం లేదు. ప్రభుత్వం ఏదైనా శక్తిమంతమైన భాష, సాహిత్యం, సంస్కృతి, జాతి ప్రగతికీలకమని నమ్మకపోవటంతో, మాతృభాష ప్రస్తావన కనపడదు. పైగా ఆంగ్ల మాధ్యమం ప్రజాకర్షక పథకమైంది.

తెలుగు మీడియం పాఠశాలలు మూతపడుతున్నాయి. తెలుగు మాధ్యమంలో బోధనకి యిక కాలం చెల్లిందని పాలకులు ప్రాథమిక స్థాయి నుంచి తెలుగుని ఒక సబ్జెక్ట్‌గా కుదించి, పైగా భాషని ఉద్ధరిస్తున్నామని బుకాయిస్తున్నారు. ఉద్యోగాల పోటీలో నిలవాలంటే ఆంగ్ల మాధ్యమంలోనే చదవాలని తల్లిదండ్రులను పరోక్షంగా ఊదరగొడుతున్నారు. ఆంగ్ల వ్యామోహానికి అడ్డుకట్ట వేయవలసిన పాలకులు ఆంగ్లానికి వూడిగం చేయిస్తున్నారు. ఆధునిక విద్యావసరాలకు తెలుగు పనికిరాదని, తెలుగులో చదివితే పనికిరాకుండా పోతారని తెలుగును విద్యాధికులే దూరం చేస్తున్నారు. దానికితోడు ఆధునిక జీవనశైలి కారణంగా యువతకు తెలుగుభాష పట్ల ప్రేమ, అభిమానం, ఆసక్తి తగ్గుతోంది.

తెలుగు చదివే అలవాటు ప్రోత్సహించాలి. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా మాధ్యమాల ద్వారా ప్రస్తుత డిజిటల్ యుగంలో భాషను బలోపేతం చేసి, సాహిత్య చర్చలు, భాషా నైపుణ్యాలను మెరుగుపరిచే కార్యక్రమాలకు ప్రాధాన్యత యివ్వాలి. ప్రాథమిక స్థాయిలో తెలుగు మాట్లాడటం, చదవటం, రాయటం తప్పనిసరి చేయాలి.

**(మిగతా 24వ పేజీలో....)**

# జీవితం మధురంగా ఉండాలంటే?

జీవితంలో పలు సమస్యలను ఎదుర్కొన్న ఒక పారిశ్రామికవేత్త తానెంతగానో గొప్పగా భావించే ఆధ్యాత్మిక గురువు వద్దకు వెళ్ళి తన గోడు చెప్పుకోసాగాడు..

"గురువుగారూ, నా జీవితంలో అంతా అయిపోయింది. ఏదీ సక్రమంగా జరగటం లేదు. భార్య సరిగ్గా లేదు. పిల్లలు సరిగ్గా లేరు. నిర్వహిస్తున్న సంస్థ సక్రమంగా జరగటం లేదు. బజారులో నేను నడిచి వెళ్తుంటే ఎవరూ నన్ను పట్టించుకోవడం లేదు.

ఎవరూ నమస్కరించడం లేదు. ఇటువంటి పరిస్థితిలో నేను నా జీవితాన్ని ఎలా నడపటం గురువుగారూ?" అని బాధపడ్డాడు.

ఆయన చెప్పినవన్నీ విన్న గురువుగారు "ఏమీ ఆందోళన చెందకండి.. నేను నీకొక మందు ఇస్తాను.." అంటూ ఆయన ఓ గ్లాసు నీటిలో నాలుగు స్పూన్ల ఉప్పు కలిపి పారిశ్రామికవేత్తకు ఇచ్చారు. ఆ నీటిని తాగమన్నారు.

గురువుగారి మాటగా పారిశ్రామికవేత్త నీరు తాగారు. వాంతి వచ్చినంత పనై ఆయన నీటిని ఉమ్మేసారు.

మీరే గ్లాసు నీటిలో నాలుగు స్పూన్ల ఉప్పు కలిపిస్తే ఎలా తాగగలను...కడుపు తిప్పుతోంది" అని చెప్పాడు పారిశ్రామికవేత్త.

"ఓహో...అలాగా...నాతో రా" అంటూ గురువుగారు ఆయనను ఒక కొలను వద్దకు తీసుకుపోయారు.

ఆ కొలనులో నాలుగు స్పూన్ల



ఉప్పు వేసి ఓ గ్లాస్ నీరు తీసిచ్చారు తాగమని. పారిశ్రామికవేత్త తాగాడు.

"ఇప్పుడు నీరెలా ఉంది?" అని అడిగారు గురువుగారు. "నీటికేం...బాగుంది" అని గురువు గారిచ్చిన నీటిని తాగేసాడు, పారిశ్రామికవేత్త.

"ఏంటీ, నీరు బాగుందా...ఉప్పగా లేదా?" అని అడిగారు గురువుగారు.

"నీరు ఉప్పగా లేద"న్నాడు పారిశ్రామికవేత్త.

"అదేంటీ? నాలుగు చెంచాల ఉప్పు నీటిలో పోశానుగా....అప్పటికీ నీరు బాగుందా? ఈ నాలుగు చెంచాల ఉప్పే ఇందాక ఒక గ్లాసు నీటిలో కలిపిస్తే ఉప్పగా ఉందన్నావు?" అని అడిగారు గురువుగారు.

"గురువుగారూ! ఏమిటంటున్నారు ఏమీ తెలీనట్లు... ఏమిటీ ఆట. ఇంటి దగ్గర మీరు ఒక గ్లాసు నీటిలో ఉప్పు కలిపి ఇచ్చారు. అది తాగడంతోనే కడుపు తిప్పినట్లయ్యింది. వాంతొచ్చింది.

కానీ ఇక్కడేమో ఓ కొలనులో ఉప్పు కలిపిచ్చారు నీరు తాగమని. అందువల్ల నీరు ఉప్పగా అనిపించలేదు. నీరు తాగగలిగాను" అని పారిశ్రామికవేత్త అన్నాడు.

దాంతో గురువుగారు "నీ మనస్సుని ఎందుకు ఒక గ్లాసులో ఉంచుకున్నావు? కొలనులా విశాలంగా ఉంచుకో. అప్పుడు ఏ సమస్య అయినా ఉప్పల్లే కరిగిపోతుంది. తన రుచిని మార్చుకోని కొలనులా నీ మనసుంటే నీకెందుకు ఇబ్బందులొస్తాయి. నీ మనసుని ఈ క్షణం నుంచీ కొలనులా ఉంచుకో. జీవితం మధురంగా ఉంటుంది" అన్నారు.

**- యామిజాల జగదీశ్**

---

(23వ పేజీ తరువాయి..)

## ఆంగ్ల మాధ్యమం..

ఆంగ్లేయ పాలనలో విద్యావిధానం బతుకుతెరువయింది. ఆంగ్లేయాధికారులు కూడా తెలుగు నేర్చుకొని పాలించారు. క్రమేపీ చదువు, ఉద్యోగ ఆర్జనల కోసం రూపాంతరం చెందింది. ఒకప్పుడు మన దేశంలో అగ్రకులాల ఆధిపత్యంలో వున్న చదువుల తల్లి పామరుల ఇంట ప్రవేశించింది. సమాజంలో అన్ని వర్గాలకు చదువుకోవటం సంపాదన విద్య బతుకుతెరువు అయింది. స్వాతంత్ర్యానంతర ప్రజా ప్రభుత్వాలు అక్షరాస్యత పెంపొందింపచేసి, దళిత అణగారిన వర్గాలలో విద్యావికాసాన్ని ప్రోత్సహించాయి.

జనాభా పెరగటంతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు ఆధారమైన చదువు కేవలం సంపాదనల కోసం, ఆంగ్లం క్రమేపీ బలపడి ప్రస్తుత దశాబ్దాల సాంకేతిక సమాజంలో మాతృభాష మరింతగా విస్మరించబడింది.

ప్రభుత్వాలు, జనాభాలో అత్యధిక శాతం తల్లిదండ్రుల ఆకాంక్షలకు అనుగుణంగా, మాతృభాషను పక్కకు నెట్టి ఆంగ్లాన్ని మాధ్యమంగా అందించి, ప్రజాకర్షక ప్రలోభానికి తెరలేపాయి. కేంద్రాధిపత్యం హిందీ, రాష్ట్ర అధికార సారధ్యం ఆంగ్లం, తల్లిదండ్రుల ఉద్యోగాల బతుకుతెరువు తాపత్రయం, ప్రస్తుత డిజిటల్ ప్రపంచంలో మాతృభాషలు, దిక్కు తెలియని దీనత్వంతో కృంగి కృశించిపోతున్నాయి.

**– జయసూర్య**

వాస్తువార్త
వాస్తు విద్వాన్ సాయిశ్రీ
డా॥ దంతూరి పండరినాథ్
సెల్: 9885446501/9885449458



# గృహావరణలో ఎలాంటి చెట్లు ఉండాలి?

**సి.అనసూయ, కల్వకుర్తి**

**ప్రశ్న: ఇంటి ఆవరణలో ఎలాంటి చెట్లు పెంచవచ్చు? ఎలాంటి చెట్లు పెంచకూడదు?**

**జవాబు:** ఒక వృక్షం పది మంది సుపుత్రులతో సమానం. అటువంటి పుత్ర సమానమైన వృక్షాలను గృహావరణలో ఏ విధంగా, ఏ దిక్కులో పెంచాలో, ఆ నియమాలను వాస్తుశాస్త్రంలో తెలియజేసారు. భూమి పైన వివిధ రకాల వృక్ష సంపద ఉన్నది. ఆ వృక్షాలన్నంటినీ వాటి, వాటి మూల స్వభావాలను అనుసరించి కొన్ని గ్రహాల సృష్టిగా ఈ విధంగా విశ్లేషించారు.

సూర్యుడు - మహావృక్షాలు
చంద్రుడు - పాలచెట్లు
కుజుడు - కారంగల చెట్లు
బుధుడు - ఫలములివ్వలేని చెట్లు
గురువు - ఫలములిచ్చే చెట్లు
శుక్రుడు - నీరస వృక్షాలు
రాహు-కేతువులు- పుట్టలు..
మొదలయినవి.

అయితే ఈ చెట్లన్నిటిలోనూ కొన్ని మాత్రమే గృహావరణలో పెంచుకోవడం వల్ల మంచి ఫలితాలను పొందే వీలుంటుంది. తూర్పు దిశలో మర్రిచెట్టు, దక్షిణ దిశలో అత్తిచెట్టు, పడమర దిశలో జమ్మిచెట్టు, ఉత్తర దిశలో జువ్విచెట్టు, ఈశాన్యంలో రావిచెట్టు, ఆగ్నేయంలో మేడిచెట్టు, నైరుతిలో దూర్వాదుర్శన చెట్టు, వాయవ్యంలో మోదుగచెట్టు ఉన్నట్లయితే ఆ గృహ యజమానికి మేలు జరుగుతుంది.

కొబ్బరిచెట్లు, పనసచెట్లు గృహావరణలో ఏ దిక్కున ఉన్నా



శుభ ఫలితాలను ఇస్తాయని పేర్కొన్నారు. అలాగే తూర్పున రావిచెట్టు, దక్షిణ దిశలో దువ్విచెట్టు, పడమరలో మర్రిచెట్టు, ఉత్తరంలో అత్తిచెట్టు ఉన్నట్లయితే గృహ యజమానికి కీడు కలుగుతుందని పేర్కొన్నారు. గృహావరణలో ఏ విధమైన వృక్షాలు ఉండవచ్చో లేదా ఏ విధమైన వృక్షాలు ఉండకూడదో తెలిపే విషయంలో వివిధ వాస్తు గ్రంథాలలో భేదాలున్నాయి.

చింతచెట్టు, మారేడు చెట్టు, తాటిచెట్టు, రేగుచెట్టు, కుంకుడుచెట్టు, కానుగచెట్టు, మోదుగచెట్టు, సంపెంగ చెట్టు గృహావరణలో ఎక్కడ ఉన్నా గృహ యజమానికి కష్టాలు తప్పవంటారు. చెట్ల విషయంలో సాధారణ నియమాలు వున్నప్పటికీ మినహాయింపులు కూడా వర్తిస్తాయి.

గృహావరణలో పాలుగారే వృక్షాలు(దుగ్ధ వృక్షాలు) వుంటే ద్రవ్యనాశనం కలుగుతుంది. గృహావరణలో ముళ్లచెట్లు వుంటే శత్రువృద్ధి, శతృవులచే సంతాపం కలుగుతూ ఉంటుంది.

గృహావరణలో ఫలే(పండ్లు కాసే) వృక్షాలుంటే సంతానానికి హాని కలుగుతూ ఉంటుంది.

గృహావరణలో గృహానికి దక్షిణ భాగంలోగానీ, గృహానికి సమీపంలో దక్షిణ దిక్కులోగానీ చెంపక వృక్షం, పాటల వృక్షం, కదళీ వృక్షం, జాజి, కేతకి వృక్షాలున్నట్లయితే ధనధాన్యాలకు హాని కలుగుతూ ఉంటుంది. గృహావరణలోగానీ గృహ సమీపంలోగానీ భూతనమాశ్రితములగు వృక్షాలున్నట్లయితే వాటిని ఛేదించివేయాలి.

గృహావరణలో ఆగ్నేయంలోగానీ, గృహ సమీపంలో ఆగ్నేయంలోగానీ, క్షీర వృక్షాలు, అశ్వత్థ వృక్షాలు, రక్త పుష్ప, ద్రుమ, ఖంటక, క్షీర వృక్షాలు, షాల్మలి వృక్షం, ఉదంబర వృక్షం, జువ్విచెట్లు... వీటిలో ఏ వృక్షం వున్నా మృత్యుభయాలు, పీడలు కలుగుతూ ఉంటాయి.

వాస్తు విద్వాన్ **డా॥ దంతూరి పండరినాథ్** పాఠకుల సమస్యలకు ఆదివారం 'వాస్తువార్త'లో సమాధానాలిస్తారు. ఈ కింది కూపన్ జతచేసి సమస్యలు పంపవలసిన చిరునామా:
**సాయిశ్రీ వాస్తు కన్సల్టెన్సీ, 3-2-4, కింగ్స్‌వే, రాష్ట్రపతి రోడ్, సికిందరాబాద్-3**

వాస్తువార్త

పూర్తి పేరు : ............................................
పుట్టిన తేది : ............................................
జన్మ నక్షత్రం: ................తల్లి పేరు: ................
చిరునామా:............................................

# కళలకు కాణాచి కర్ణాటక

అద్భుతమైన దేవాలయాలు, కళ్ళు చెదిరే శిల్పకళా సోయగాలు, పేరెన్నిక కలిగిన చారిత్రక ప్రదేశాలు.. కర్ణాటక రాష్ట్రంలో పర్యటించే పర్యాటకులు జీవిత పర్యంతం నెమరు వేసుకునేలా ఇటువంటి ప్రదేశాలను పర్యటించి ఆనందాన్ని, ఆహ్లాదాన్ని స్వంతం చేసుకుంటారు. అటువంటి అనుభూతులను మేం కూడా మా కర్ణాటక పర్యటన ద్వారా మదినిండా దాచుకున్నాం.

## లేపాక్షి

హైదరాబాద్ నుంచి బయలుదేరిన మేం ముందుగా లేపాక్షికి చేరుకున్నాం. లేపాక్షిలో గల వీరభద్ర స్వామి దేవాలయం 16వ శతాబ్దంలో నిర్మించబడింది. అద్భుతమైన కళా చాతుర్యంతో విజయ నగర సామ్రాజ్యాధిపతులు నిర్మాణ శైలి గావించారు. 108 శైవ క్షేత్రాలలో లేపాక్షి ఒకటని స్కాంద పురాణం తెలుపుతోంది. సీతమ్మ వారిని అపహరించుకు పోతున్న రావణాసురుడితో యుద్ధం చేసి జటాయువు ఇక్కడే పడిపోయాడని, రాములవారు జటాయువు చెప్పిన విషయం విని అభిమానంతో "లే పక్షి" అని మోక్షం ప్రసాదించి నందున క్రమంగా ఈ ప్రాంతం లేపాక్షి అయిందని స్థల పురాణం. కర్ణాటక సరిహద్దు నుంచి మేం మైసూర్‌లో ప్రవేశించాం.

## ప్యాలస్‌ల నగరం..మైసూరు

మైసూర్‌కు కేవలం 13 కి.మీ. దూరంలోగల శ్రీరంగపట్నం శ్రీ రంగనాథ స్వామి సన్నిధానం. కావేరి నది చుట్టూ ఆవరించి ఇదొక ద్వీపంలా కనిపిస్తుంది. రంగనాథ స్వామి ఆలయాన్ని 9వ శతాబ్దంలో గంగ వంశపు రాజులు నిర్మించారు. హైదర్ ఆలీ, టిప్పు సుల్తాన్‌ల ఆధ్వర్యంలో శ్రీరంగపట్నం మైసూర్ రాజ్యానికి రాజధాని అయింది.



టిప్పుసుల్తాన్ సమాధి, టిప్పు ప్యాలస్ ఇక్కడి చరిత్రను చెపుతాయి. అనంతరం మైసూర్ ప్యాలెస్‌ను సందర్శించాం. ప్రతి సంవత్సరం దసరా వేడుకలు ఈ ప్యాలస్‌లో అంగరంగ వైభవంగా జరుగుతాయి. 14వ శతాబ్దంలో నగరం నడిబొడ్డున నిర్మాణం గావించిన ఈ ప్యాలస్ 72 ఎకరాల్లో ఉంది.

ఈ ప్యాలస్‌కు 13 కి.మీ. చాముండేశ్వరి దేవాలయం అష్టాదశ శక్తి పీఠాల్లో ఒకటి. ఇది సతీదేవి చెవులు పడిన ప్రదేశంగా ఐతిహ్యం.

## అత్యద్భుత శిల్పకళ

మా పర్యటనలో మరచిపోలేని అద్భుతాలను చూసే అదృష్టం కలిగింది. అవే హళేబీడు, బేలూరు. హోయసలేశ్వర రాజు నిర్మించినందున ఈ ఆలయాన్ని ఆయన పేరు మీదనే పిలుస్తారు. ఇది 12వ శతాబ్దపు హిందూ శివాలయం. ఈ దేవాలయంపై చెక్కిన శిల్పకళ మాటలతో వర్ణించలేని అద్భుతం. ఇది శైవ మత సంప్రదాయ స్మారక చిహ్నం అయినా, హిందూ మతంలోని వైష్ణవం, శాక్త మత సంప్రదాయాల నుండి అనేక ఇతివృత్తాలతో శిల్పకళ ఇంకా జైన మతం నుండి అనేక చిత్రాలు కనబడతాయి. యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశంగా పేర్కొనబడే దీనిని దోర సముద్ర అని కూడా పిలుస్తారు. లోపల రెండు గర్భగుడులల్లో శివలింగాలు దర్శనం ఇవ్వడం విశేషం. ఈ రెండు గర్భాలయాలు ఎదురెదురుగా ఉంటాయి. ఈ ఆలయం క్లోరోటీన్ స్కిస్ట్‌తో నిర్మించబడింది. 19వ శతాబ్దపు కళా విమర్శకుడు జేమ్స్ ఫెర్గుసన్ దీనిని మనుషుల శ్రమ అద్భుత ప్రదర్శనగా పేర్కొన్నాడు.

ఆ తర్వాత శిల్ప కళల కాణాచి బేలూరు చేరుకున్నాం. ఇక్కడి చెన్నకేశవ స్వామి దేవాలయం 12వ శతాబ్దానికి చెందినది. తొమ్మిది విష్ణు మూర్తి అవతారాలు, పార్వతి లేకుండా నటరాజు, ద్రౌపది స్వయంవరం, రావణుడు కైలాసాన్ని ఎత్తడం.. ఇలా మరెన్నో అద్భుత శిల్పాలు అసాధారణమైన రీతిలో సృష్టించిన తీరు మైమరచి పోయేలా చేస్తాయి. నవరంగ మందిరంలో 48 స్థంభాలు ప్రత్యేక రీతిలో కనిపిస్తాయి. చాలా గొప్ప స్ట్రక్చర్. బేలూరు, హళేబీడులో గల ఆలయాల శిల్పకళ జక్కన్నా చారిచే రూపుదిద్దుకున్నాయి. ప్రతి ఏడాది కర్ణాటక ప్రభుత్వం సుప్రసిద్ధ శిల్పులు, కళాకారులకు జక్కన్నా చారి అవార్డులను ప్రదానం చేస్తుంది.

## కుక్కె సుబ్రహ్మణ్యం

కుక్కేలోగల సుబ్రహ్మణ్య స్వామి ఆలయం చాలా మహిమాన్విత మైనది. రాహు, కేతు, కుజ గ్రహాల వంటి ప్రతికూల ప్రభావాలు తొలగించుకోవడానికి భక్తులు ఈ దేవాలయాన్ని సందర్శిస్తారు.

పరశురాముడు సృష్టించిన ఏడు పుణ్య క్షేత్రాల్లో కుక్కె ఒకటి. వాసుకి సమేతంగా ఉన్న సుబ్రహ్మణ్యుడు దేవసేన, వల్లి సమేతంగా కొలువు తీరిన క్షేత్రం ఇది.

**శృంగేరి:** ఇక విశిష్ట క్షేత్రం శృంగేరి చాలా ప్రాముఖ్యత కలిగినది. తుంగభద్రా నది తీరంలో ఉన్న శృంగేరికి ఈ పేరు ఋష్య శృంగగిరి నుంచి వచ్చింది. ఇది శారదా మాత కొలువు తీరిన ఆలయం. ఈ ఆలయం సమీపంలో శంకరాచార్యుల వారు స్థాపించిన శంకర మఠం ఉంది.

**హోర్నాడు:** ఈ యాత్రలో మేం దర్శించిన మరో విశేష ఆలయం హోర్నాడులోని అన్నపూర్ణేశ్వరి. ఈ ఆలయం ఆదిశంకరాచార్యుల వారిచే ప్రతిష్ఠ గావించబడింది. ఈ అమ్మవారిని దర్శిస్తే నలుగురికి అన్నం పెట్టే భాగ్యం కలుగుతుందని భక్తుల అపార నమ్మకం.

**ఉడిపి:** ఈ సందర్శనలో శ్రీకృష్ణ మఠం దర్శించాం.



13వ శతాబ్దంలో వైష్ణవ సన్యాసి మధ్వాచార్య ఈ మఠాన్ని స్థాపించారు. ఇక్కడ శ్రీకృష్ణుడి విగ్రహాన్ని వెండిపూతతో కూడిన కిటికీకి గల తొమ్మిది రంధ్రాల నుండి దర్శించాలి. ఇక్కడ గోశాల, బంగారు రథం మమ్మల్ని ఆకర్షించాయి.

**కొల్లూరు:** మరో మహిమాన్విత ప్రదేశం కొల్లూరులోని మూకాంబికా దేవి వారిని దర్శించుకున్నాం. కామాసురుడు అనే రాక్షసుడు వరం అడగకుండా వాక్ దేవత అతడిని మూగవాడిని చేస్తుంది. అందుకే అతడు మూకాసురుడు అయ్యాడు. ఆ రాక్షసుడిని చంపిన శక్తిదేవిని మూకాంబికా దేవిగా కొలుస్తారు. ఈ ఆలయానికి తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి ఎం.జి.రామచంద్రన్ బంగారు ఖడ్గాన్ని బహూకరించారు. ఈ యాత్రలో మమ్మల్ని తరింపచేసిన మరో రెండు క్షేత్రాలు **మురుడేశ్వర్, గోకర్ణం.** ప్రపంచంలోనే అతి పొడవైన శివుని విగ్రహం ఉన్న క్షేత్రం మురుడేశ్వర్. రావణుడు ఆత్మలింగాన్ని పెరికివేసే ప్రయత్నంలో లింగంపై నున్న వస్త్రాన్ని విసిరివేస్తే అది కందుక పర్వతంపై నున్న మృదేశ్వరలో పడుతుంది. అది కాలక్రమంలో మురుడేశ్వర్‌గా మారింది. ఇరవై అంతస్తుల ఇక్కడి గాలిగోపురాన్ని నిర్మించడానికి రెండు సంవత్సరాల కాలం పట్టింది. బీచ్ ఎంతో ఆకర్షణీయంగా ఉంటుంది. శైవక్షేత్రం గోకర్ణం సందర్శించిన వారికి పాత 'భూకైలాస్' సినిమా స్ఫురిస్తుంది. శివుడిచ్చిన ఆత్మలింగం అనివార్య పరిస్థితుల్లో రావణుడు ఇక్కడ విడిచిపెడతాడు. అతను లంకకు తీసుకువెళ్లకుండా విష్ణువు తన మాయను ప్రదర్శిస్తాడు. అందుకే గోకర్ణం అతి పవిత్ర స్థలంగా ఖ్యాతి చెందింది. ఇక్కడి కోటితీర్థాన్ని గంగతో సమానంగా భావిస్తారు. గోవాకు సమీపంలో ఉన్న గోకర్ణలో అనేక బీచ్‌లు ఉన్నాయి.



**హంపి:** కర్ణాటకలో మేం చివరిగా సందర్శించిన చారిత్రక ప్రదేశం హంపి. 13-15 శతాబ్దాలలో విజయనగర సామ్రాజ్యానికి రాజధానిగా హంపిలో ఆనాటి చారిత్రక అవశేషాలు ఇంకా ఉన్నాయి. ఉత్తరం వైపు తుంగభద్రా నది ఉంటుంది. మిగతా మూడు వైపులా పెద్ద పెద్ద గ్రానైట్ శిలలతో అప్పటి విజయనగర వీధుల వైభవాన్ని హంపి తెలుపుతూ ఉంటుంది. విరూపాక్ష దేవాలయం అభివృద్ధిలో శ్రీకృష్ణ దేవరాయల పాత్ర ఎంతో ఉంది. హంపికి ఈశాన్య భాగంలో ఆనెగొంది గ్రామానికి ఎదురుగా ఉన్న విఠల దేవాలయ సముదాయం అప్పటి శిల్పకళా సంపత్తికి నిదర్శనం. ఇందులో సప్త స్వరాలు పలికే ఏడు స్థంభాలు, ఏక శిలా రథం సందర్శించాక, కృష్ణ బజార్‌లో అంగట్లో రతనాలు అమ్మిన ప్రాంతం, ఉగ్ర నరసింహమూర్తి విగ్రహం సందర్శించి ఎన్నో



అనుభూతులను మనస్సు పొరల్లో నిక్షిప్తం చేసుకున్నాం.

**మంత్రాలయం:** తిరుగు ప్రయాణంలో ఉమ్మడి కర్నూలు జిల్లాలో గల మధ్వాచార్యుల పరంపరలో ధృవ నక్షత్ర సమానమైన రాఘవేంద్ర స్వామి వారి క్షేత్రాన్ని దర్శించాం. ప్రహ్లాదుని అవతారంగా భావింపబడే శ్రీ గురు రాఘవేంద్ర స్వామి బృందావనం ఎంతో ప్రశాంత వాతావరణంలో నెలకొని ఉంది.

**- పంతంగి శ్రీనివాస రావు**

# తీపి వారసత్వం.. లోనావాలా చిక్కి

**చిక్కి అనేది భారతదేశంలోని ఒక సంప్రదాయ మిఠాయి. దీన్ని బెల్లంతో కానీ పంచదార పాకం, పల్లీలు, నువ్వులు, కొబ్బరి, జీడిపప్పు, బాదం వంటి వివిధ రకాల గింజలు లేదా విత్తనాలతో తయారు చేస్తారు. ఇది ఒక రకమైన కఠినమైన మిఠాయి. చిక్కిని మహారాష్ట్రలో పల్లీ పట్టీ అని కూడా పిలుస్తారు.**



మహారాష్ట్రలోని లోనావాలా అనే ప్రాంతంలో వందలాది కుటుంబాలు ఇటువంటి చిక్కిలను తయారు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. లోనావాలా చిక్కిలు దేశ, విదేశాలలో ప్రసిద్ధి చెందాయి. ఇది ప్రధానంగా వేరుశనగలు (పల్లీలు), బెల్లం లేదా చక్కెరతో తయారు చేస్తారు. బెల్లం లేదా చక్కెర పాకంలో ఈ వేరుశనగలు, గింజలు కలిపి పల్చటి ముక్కలుగా చేసి చల్లార్చితే కరకరలాడే చిక్కి తయారవుతుంది. ఇది శరీరానికి శక్తినిచ్చే, రుచికరమైన చిరుతిండి. లోనావాలాలో కేవలం వేరుశనగతోనే కాకుండా కాజు, బాదం, పిస్తా, ఎండు ద్రాక్ష వంటి డ్రైఫ్రూట్స్ కూడా వాడుతూ దాదాపు ఇరవై రకాల చిక్కిలు తయారు చేస్తున్నారు. ప్రస్తుతం కొందరు వ్యాపారులు ముప్పై రకాల చిక్కిలు కూడా తయారు చేయడం విశేషం.

## లోనావాలా చిక్కి చరిత్ర

మహారాష్ట్రలో ప్రత్యేకతగా మహాబలేశ్వర్ స్ట్రాబెర్రీలాగా, లోనావాలా చిక్కి కూడా ఒక ఐకానిక్ ఉత్పత్తి, లోనావాలా చిక్కిని మొదటిసారిగా 'మఘన్‌లాల్ అగర్వాల్' అనే మిఠాయి వ్యాపారి తయారు చేశారని తెలుస్తోంది. ఆయన 1880 దశకంలో లోనావాలా రైల్వే స్టేషన్ దగ్గర ఒక చిన్న దుకాణం పెట్టి, వేరుశనగ, బెల్లంతో చేసిన చిక్కిని అమ్మడం ప్రారంభించారు. ముంబై-పూణే రైల్వే లైన్ వేసే పనిలో ఇక్కడ పని చేసిన కూలీలకు సులభంగా శక్తినిచ్చే ఆహారం అవసరమైంది. మహారాష్ట్రలోని లోనావాలాలోని ఒక స్వీట్ షాప్ యజమాని మఘన్‌లాల్ అగర్వాల్ రైల్వే కార్మికులకు శక్తి అందించడానికి జాగరీ, పీనట్స్, నేతితో 'గుడ్ దాని' అనే స్నాక్ తయారు చేశారు. ఆ తర్వాత దీని పేరు 'చిక్కి'గా మారింది. రైల్వే అధికారులు దీన్ని ప్యాసింజర్లకు అమ్మడానికి ఆర్డర్ చేశారు. ఇది లోనావాలా చిక్కిగా ప్రసిద్ధి చెందింది.

మరికొన్ని మూలాలు ఈ చిక్కిని తయారు చేసిన ఘనత భీమ్ రాజ్ అగర్వాల్‌కు ఆపాదిస్తాయి. బ్రిటిష్ కాలంలో కాందా గంగారాం కాచారు అనే వ్యాపారి కూడా ఈ మిఠాయిని మొదట తయారు చేశారని అంటారు, కానీ ఎక్కువ శాతం మంది దీన్ని తొలుత తయారు చేసింది మగన్‌లాల్ అగర్వాల్ అనే చెబుతారు.



నేడు లోనావాలాలో మగన్‌లాల్ చిక్కి అహల్యాదేవీ చిక్కి మోహన్లాల్ చిక్కి ఇత్యాది పాత సంస్థలు ఈ తీపి పదార్థాన్ని తయారు చేయడంలో పేరుగాంచాయి. మగన్‌లాల్ చిక్కి ఇప్పుడు ట్రేడ్ మార్క్ బ్రాండ్. 2010లో దీనికి జియోగ్రాఫికల్ ఇండికేషన్ రిజిస్ట్రేషన్ కోసం ప్రయత్నాలు జరిగాయి. మగన్‌లాల్ మరణం తర్వాత అతని కుమారులు అంబాలాల్, మోహన్‌లాల్ వ్యాపారాన్ని కొనసాగించారు. తర్వాత మోహన్‌లాల్ కుమారులు ప్రస్తాద్, భరత్, చంద్రప్రకాశ్ అగర్వాల్ దీనిని విస్తరించారు.

ఎప్పుడో 1980లో మగన్‌లాల్ అగర్వాల్ అనే వ్యక్తి

వేరుశనగలు, బెల్లంతో ఒక సులభమైన మిఠాయి తయారు చేసి రైల్వే కూలీలకు అందించేవాడు. అప్పట్లో రైల్వే లైన్ వేసేందుకు పని చేసే కార్మికులకు ఇది తేలికగా దొరికే, ఎక్కువ కాలం పాడవకుండా నిల్వ ఉండే, శక్తిని ఇచ్చే ఆహారం కావడంతో చాలా ప్రాచుర్యం పొందింది.

అదే తరువాత చిక్కీగా ప్రసిద్ధి చెందింది. అక్కడినుండే 'మఘనలాల్ చిక్కీ' బ్రాండ్ ప్రసిద్ధి చెందింది. నేడు రైలు మార్గంలో ప్రయాణించే ప్రయాణికులు కూడా ఈ మిఠాయి రుచిచూసి ఇష్టపడి కొనడం మొదలుపెట్టారు. అలా అది లోనావాలా స్పెషల్‌గా ఈ చిక్కీ పేరు గడించింది.

లోనావాలా చిక్కిని తొలుత మగన్‌లాల్ అగర్వాల్ తయారు చేశారు అని ఇక్కడి వారంతా విశ్వసిస్తున్నారు.

## లోనావాలా చిక్కీలో పలు రకాలు

నేడు లోనావాలా చిక్కీలో అనేక రకాలు తయారు చేస్తున్నారు. వేరుశెనగ చిక్కీ, డ్రై ఫ్రూట్ చిక్కీ, బాదం చిక్కీ, జీడిపప్పు చిక్కీ, పిస్తా చిక్కీ, కిస్మిస్ చిక్కీ, నువ్వుల చిక్కీ, కొబ్బరి చిక్కీ, మామ్రా చిక్కీ, డాల్ చిక్కీ, మిక్స్ డ్రైఫ్రూట్ చిక్కీ చాక్లెట్ చిక్కీ, కాజూ బాదం రోల్ చిక్కీ, రోజ్ డ్రైఫ్రూట్ చిక్కీ, పీనట్ మల్లై, కురమురా చిక్కీ, రాజ్‌గిరి చిక్కీ, కేసర్ పిస్తా చిక్కీ, క్రష్డ్ పీనట్ చిక్కీ, కొబ్బరి చిక్కీ, గ్రౌండ్‌నట్ చిక్కీ, కాండి లాంటి మెత్తగా ఉండే రకం సాఫ్ట్ చిక్కీ.. ఇత్యాది ముప్పై రకాల వరకు చిక్కీలను లోనావాలాలో తయారు చేస్తున్నారు. ముంబయి -పూణే రహదారిలో ప్రయాణించేవారు లోనావాలాలో ఆగి చిక్కీలు కొనడం సంప్రదాయంగా మారింది.



చిక్కిని తయారు చేయడానికి సాధారణంగా బెల్లం, పల్లీలు నువ్వులు, కాజూ, బాదాం వంటి సహజ పదార్థాలనే వాడుతారు. దీనిలో రసాయన పదార్థాలు, కృత్రిమ రంగులు ఉండవు. లోనావాలాలో చిక్కీని ఇప్పటికీ పాత పద్ధతిలోనే రాతి బల్లలపై బెల్లం పాకం వేసి, వేడి పల్లీలతో కలిపి తయారు చేస్తున్నారు. ఆ ప్రక్రియలోని చమత్కారమే దానికి అసలైన రుచిని ఇస్తుంది.

లోనావాలా శీతల, కొండప్రాంతం, అక్కడి వాతావరణం వల్ల బెల్లం పాకం సరిగ్గా చల్లబడుతుంది. చిక్కీకి కరకరలాడే గుణం వస్తుంది.

## ఆరోగ్య ప్రయోజనాలు

లోనావాలా చిక్కీలు తినడం వల్ల ఆరోగ్య పరంగా అనేక ప్రయోజనాలు కలుగుతాయి. వీటిలో ప్రొటీన్ పుష్కలంగా లభిస్తుంది. పల్లీలు, జీడిపప్పు వంటివి శరీరానికి తక్షణ శక్తినిస్తాయి. ఇది శరీర కండరాల వృద్ధికి, బలానికి సహాయపడుతుంది. బెల్లం, నువ్వులు కలయిక తక్షణ శక్తిని ఇస్తుంది. ప్రయాణాలతో పాటు ఏదైనా పని చేసిన తర్వాత తింటే అలసిన శరీరానికి సహజశక్తి లభిస్తుంది. బెల్లంలో ఇనుము సమృద్ధిగా ఉంటుంది. ఇది రక్తహీనత నివారణలో ఉపయోగకరం. ఖనిజ లవణాలు శరీరానికి, ముఖ్యంగా హృదయానికి మేలు చేస్తాయి. హృదయానికి అవసరమైన కొవ్వును పెంచుతాయి.

పల్లీలు, నువ్వులు చెడు కొవ్వును తగ్గిస్తాయి. బెల్లం, నువ్వులు పేగులకు మేలు చేసి, జీర్ణక్రియను మెరుగు పరుస్తాయి. నువ్వులలోని కాల్షియం ఎముకలకు బలం ఇస్తుంది. పెద్దవారికి, పిల్లలకు బాగా ఉపయోగకరం, కృత్రిమ పదార్థాలు లేని స్నాక్. చాక్లెట్లు, క్రీమ్ బిస్కెట్ల కంటే ఇది సహజమైనది. డైట్ చూసుకునేవారు సైతం చిన్న మోతాదులో వీటిని తినడం మంచిది.

**- షేక్ అబ్దుల్ హకీం జాని**

- ఆలస్యం చేయించకూడదు. చేయిస్తే క్షమాపణ చెప్పాలి. సమస్య సమసిపోతుంది.
- ఇష్టంగా వచ్చే కానుకలను కష్టంగా తీసుకోకూడదు.

## కార్టూన్లకు ఆహ్వానం

**కార్టూనిస్టుల నుంచి ఆరోగ్యకరమైన హాస్యాన్ని అందించే కార్టూన్లను స్వాగతిస్తున్నాం. అంశం ఏదైనా సరే! మంచి హాస్యాన్ని అందించాలి. కార్టూన్లతో పాటు మీ పేరు, చిరునామా, హామీ పత్రం తప్పనిసరిగా జత చేయాలి. ఎంపిక కాని కార్టూన్లను తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. కార్టూన్లు పంపించాల్సిన చిరునామా: ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80.**

**sunmagvaartha@gmail.com**

# 19 అక్టోబరు, 2025 నుండి 25 అక్టోబరు, 2025 వరకు

## వారఫలం



**శ్రీమతి ములుగు శివజ్యోతి, ప్రముఖ జ్యోతిష్యురాలు**

నారాయణ నాయక్ కాంప్లెక్స్, 2వ అంతస్తు,
గాంధీ జ్ఞానమందిర్ వెనుక, కోఠి, హైదరాబాద్-1
ఫోన్ : 98494 53449, 9440927795

### మేషం

ఈ వారం తొందరపాటు నిర్ణయాలకు తావివ్వకుండా ఎంతగానో ప్రయత్నిస్తారు. నూతన కార్యక్రమాలను ప్రారంభిస్తారు. చుట్టుపక్కల విషయాలలో అతిగా కలగజేసుకోకుండా మీ గౌరవాన్ని మీరు దక్కించుకుంటారు. మెడలో కాలభైరవ రూపు ధరించండి. ప్రయోజనాలని దృష్టిలో ఉంచుకొని కొంతమందితో స్నేహ బంధుత్వాలను కలుపుకుంటారు.

### వృషభం

ఈ వారం స్నేహితుల వ్యాపారాలలో పెట్టుబడులు పెట్టాలని ఆలోచనలు తాత్కాలికంగా విరమించుకుంటారు. సామాజిక దృక్పథంతో ఆశ్రమాలకు ఓల్డేజ్ హోమ్స్‌కు విరాళాలను అందజేస్తారు. పెంపుడు జంతువులను పెంచుకోవాలన్న ఆలోచనలు ముడిబడతాయి. ఎరుపువత్తులతో అష్టమూలికా తైలంతో నిత్య దీపారాధన చేయండి. పరిచయం లేని వ్యక్తులకు అధిక సమాచారం తెలియచేయవద్దు.

### మిథునం

ఈ వారం స్థిరచరాస్తులు సంబంధించిన ముఖ్యమైన వ్యవహారాలు విషయాలు నత్తనడకన సాగుతాయి. అయిన వాళ్ళతో విభేదాలు ఏర్పడే అవకాశాలు ఉన్నాయి. కొంతమంది స్నేహితుల ద్వారా ఉపయుక్తమైన సమాచారాన్ని అందుకో గలుగుతారు. నూతన ఉద్యోగం కోసం చేసే ప్రయత్నాలు అనుకూలిస్తాయి. హరి చందనంతో శ్రీ విష్ణు అర్చన చేయించి, ఆ గంధం బొట్టు రోజు ధరించండి.

### కర్కాటకం

ఈ వారం సినీ కళాకారులకు కాలము అనుకూలంగా ఉంది నూతన అవకాశాలు ప్రాజెక్టులను అందుకో గలుగుతారు. ఆహార నియమాలు, జాగ్రత్తలు, కచ్చితంగా పాటిస్తారు. ఆధ్యాత్మిక కేంద్రాల పట్ల ఆకర్షితులవుతారు. పూజలు వ్రతాలు చేసుకోవాలన్న ఆకాంక్ష మరింతగా పెరుగుతుంది. దైవ దర్శనం చేసుకుంటారు. నవగ్రహాల దగ్గర నవగ్రహ వత్తులతో అష్టమూలిక తైలంతో దీపారాధన చేయండి.

### సింహం

ఈ వారం ఎన్నో విషయాలలో మానసిక శారీరిక ఒత్తిడి ని ఎదుర్కొంటారు. ఏది ఏమైనప్పటికీ మనం బాగుంటాం ఎవరికి ఇష్టం లేదన్నట్టుగా ఉంది కాబట్టి మనం కచ్చితంగా బాగుండాలి, బాగుపడాలి అన్న సంకల్పాన్ని కలిగి ఉంటారు. గోమతి చక్రాలతో లక్ష్మీదేవి అష్టోత్తరాన్ని చదువుతూ అమ్మవారికి పూజ చేయండి. దూర ప్రాంతంలో ఉన్న పిల్లల యోగక్షేమాల గురించి ఎంతగానో ఆలోచిస్తారు, పరితపిస్తారు.

### కన్య

ఈ వారం ప్రజాకర్షణ కలిగి ఉంటారు. ప్రజా సంబంధ బాంధవ్యాలు అధికంగా కూడిన వ్యాపారస్తులకు లాభాలు అందుకో గలుగుతారు. తీసుకున్న రుణాలను చెల్లించడానికి చేతిలో ధనం నిలుస్తుంది. కొన్ని శుభకార్యాల నిమిత్తం అయిన వాళ్ళ సహాయ సహకారాలను మీరు ఆశిస్తారు, పరస్పరం మీ సహాయం వారికి కూడా అందజేస్తారు. ఓం నమో నారాయణ ఒత్తులతో అష్టమూలికా తరంతో నిత్య దీపారాధన చేయండి.

### తుల

ఈ వారం వస్తున్న ఆదాయం సరిపోక మరికొన్ని మాధ్యమాల ద్వారా ఆదాయాన్ని పెంచుకోవడానికి శ్రమిస్తారు. పార్ట్ టైం జాబ్ స్వీకరించడం, ట్యూషన్ చెప్పే విధంగా సంభవిస్తుంది. కళా సాంస్కృతిక రంగాల పట్ల ఆకర్షితులవుతారు. పూజలలో ఆరావళి కుంకుమను ఉపయోగించండి. ఫ్యాషన్ డిజైనింగ్ వస్త్ర సంబంధమైన కుట్లు అల్లికలు అటువంటివి నేర్చుకోవాలన్న ఆలోచనలు ముమ్మరమవుతాయి.

### వృశ్చికం

ఈ వారం కొత్త బాధ్యతలు స్వీకరించడం ద్వారా ప్రయోజనాలు అందుకో గలుగుతారు. గత స్మృతులు జ్ఞాపకానికి వస్తాయి. ఆర్థికంగా ఎదగడానికి రకరకాలుగా ప్రయత్నిస్తారు. ప్రయాణాలలో వాహన భద్రత విషయంలో జాగ్రత్తలు తీసుకోండి. నూతన విద్యా అవకాశాల కోసం చేసే ప్రయత్నాలు కలిసి వస్తాయి. శ్రీ లక్ష్మీచందనంతో సుబ్రమణ్య స్వామి వారికి అభిషేకం జరిపించండి.

### ధనస్సు

ఈ వారం అనుకూలమైన వాతావరణం నూతనోత్సాహం ఇస్తుంది. ఆర్థిక పరిస్థితి అనుకూలంగా ఉంటుంది. ప్రముఖులతో పరిచయాలు ఏర్పడతాయి. సంఘంలో గౌరవ ప్రతిష్టలు పెంపొందుతాయి. సమీప బంధువులను కలుస్తారు. జిల్లేడు వత్తులతో అష్టమూలికా తైలంతో దీపారాధన చేయండి ఆటంకాలన్నీ తొలగిపోతాయి. భవిష్య ప్రణాళికల గురించి చర్చించి, అధికంగా లాభం వచ్చే స్వల్పకాలిక వ్యాపారాలలో ధనాన్ని పొదుపు చేస్తారు.

### మకరం

ఈ వారం కొత్త మాధ్యమాల ద్వారా ధనం సంపాదించాలి అన్న ఆలోచనలు కలిసివస్తాయి. జీవిత భాగస్వామితో మాట్లాడేటప్పుడు సోయాలో ఉండి మాట్లాడండి. నోరు అదుపులో ఉంచండి. మీ ఇష్టదేవుళ్లకు మహాతీర్థం పొడితో అభిషేకం చేయడండి. సోదరుల నుంచి ధనలాభం పొందుతారు. నూతన ఒప్పందాలు పరిష్కారం చేసుకోగలుగుతారు. ఎదుటి వారు మీరు చెప్పేది ఆసాంతం వినకుండా మీ మీద నిందలు వేయడం అసహనానికి గురి చేస్తుంది.


### కుంభం


ఈ వారం విదేశీయాన ప్రయత్నాలు, విదేశాలలోని ఉద్యోగం కోసం చేసే ప్రయత్నాలు బాగుంటుంది. పరపతి కలిగిన వారి తోటి పరిచయాలు మేలు చేకూరుస్తాయి. నిత్యం సిద్ధ గంధంతో శ్రీ వేంకటేశ్వర స్వామివారిని పూజించండి. లలితకళలలో ప్రావీణ్యతను పొందడానికి శిక్షణా తరగతులలో చేరతారు. మంచి మధ్యవర్తిగా వ్యవహరించి ఇరువర్గాల మధ్యన సఖ్యతను సమకూరుస్తారు. జీవితాన్ని కొత్త కోణంలో చూస్తారు.

### మీనం

ఈ వారం కుటుంబంలో కలహాలు ఎడబాటుకు ఇంటికి దూరంగా వెళ్లడానికి తోడ్పడతాయి. సంతాన సంబంధమైన సమస్యలు ఎదుర్కొనే అవకాశం ఉంది. గర్భవతులు ఖచ్చితమైన బెడ్ రెస్ట్ తీసుకోవాలి. సొంత వైద్యం ఉపకరించదు. అష్టమూలిక తైలంతో లక్ష్మీతామర వత్తులతో దీపారాధన చేయండి. కొంతమంది ఆశిస్తున్న ధనాన్ని మనం వారికి ఇవ్వలేని పరిస్థితులు సంతరించుకుంటాయి.


# ఈ వారం కార్టూన్స్


ఎవరికి వారే కాకుండా....కాలనీ అంతా ఒకే చోట చేరి.. సామూహికంగా బాణసంచా కాల్చి... దీపావళి ఘనంగా జరుపుకోవాలని తీర్మానించనైనది..!!!
కాలనీ తీర్మాన సమావేశం


కష్టాల్లో ఉన్నా ఐదు వేలు అప్పు కావాలంటే నేనివ్వలేదు..
ఇలా సూసైడ్ చేసుకుంటావని తెలిస్తే ఐదు లక్షలైనా ఇచ్చేవాడిని కదా బావా !!


నువ్వు దేనికోసం వాకింగ్ చేస్తున్నట్టు..?!





హిమాచల్‌ప్రదేశ్‌లోని
ఈ ద్వీపాన్ని ప్రశార్ లేక్ అంటారు.
ఒక్కో సీజన్‌లో ఒక్కో విధంగా కనువిందు
చేసే ఈ సరస్సును చూడటానికి
పర్యాటకులు క్యూ కట్టడంలో
విశేషముంది.

